www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ ప్రతి అక్షరం జనం కోసం..


పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

☎ : 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar**

కరీంనగర్ | సంపుటి : 02 | సంచిక : 257 | శుక్రవారం | 7 మార్చి, 2025




## సర్కార్‌కు హైకోర్టు షాక్

లగచర్ల, హకీంపేట భూ సేకరణపై స్టే

నోటిఫికేషన్ రద్దు చేయాలని సంచలన తీర్పు

.. వివరాలు 2లో



## గాలిమాటలకు జవాబు చెప్పాలా?

సీఎంపై కిషన్‌రెడ్డి సీరియస్

.. వివరాలు 3లో



## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు
# కేబినెట్ ఆమోదం

బిల్లుకు తుది మెరుగులు దిద్దాలని సీఎం ఆదేశం

- న్యాయపర చిక్కులు లేకుండా చూడాలి
- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులపై చర్చ
- సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన భేటీ

**ప్రజానావ, హైదరాబాద్:** ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయ నిపుణుల సలహాలు తీసుకుని ముసాయిదా బిల్లుకు తుది మెరుగులు దిద్దాలని, న్యాయపర చిక్కులు లేకుండా చూడాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినేట్ భేటీ కొనసాగింది. మాల, మాదిగ, డక్కలి.. ఇలా తెలంగాణలో 59 ఎస్సీ కులాలు ఉన్నాయి. ఆ జాబితాలోని కులాలకు ప్రభుత్వ విద్య, ఉద్యోగాల్లో కొంత శాతం వరకు రిజర్వేషన్ ఉంటుంది. తెలంగాణలో అది మిగతా 2 లో

## భూపాలపల్లి అటవీ ప్రాంతంలో
# చిరుత సంచారం

- ఆందోళనలో స్థానిక ప్రజానీకం
- చిరుత సంచారాన్ని ధృవీకరించని అటవీశాఖ



03

వామ్మో.. పులి సంచరిస్తోందంటూ జిల్లాలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఎక్కడిదో వీడియో తెలియదుకానీ సోషల్ మీడియాలో మాత్రం వైరల్ అవుతోంది. గోరుగత్తుపల్లి శివారులోని బొక్కిచెరువు సమీపంలో చిరుత పులి సంచరిస్తుందని పుకార్లు జోరుందుకున్నాయి. మొక్కజొన్న చేను వద్ద చిరుత పులి తిరుగుతున్న వీడియోను ఓ మహిళ రికార్డు చేసిందంటూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

## ఎమ్మెల్సీ కావాలని అడగబోను



02

కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



# స్థానికులకే ఉపాధి

- ఫోర్త్ సిటీ నిర్మాణం కోసం కేఎల్ఆర్ కృషి
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- డీసీపీ, లెన్స్ కార్ట్ నిర్మాణాలకు భూమి పూజ
- భూ నిర్వాసితుల రుణం తీర్చుకుంటాం: కేఎల్ఆర్

02

ఫోర్త్ సిటీతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలో వచ్చే ప్రతీ పరిశ్రమలో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పిస్తామని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో డీసీపీ కార్యాలయం, లెన్స్ కార్ట్ పరిశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేశారు.



03

## కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కవర్గం సంతోషంగా లేదు

స్కాలర్‌షిప్‌లు రాక విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు

రేవంత్‌రెడ్డి అవగాహన లేని పాలనతో కష్టాలు : హరీశ్‌రావు


## ఎస్ఎల్‌బీసీ ఘనటపై నిజాలు దాస్తున్న కాంగ్రెస్

- ప్రమాదం గురించి పట్టించుకోలేదు
- కమీషన్ల కోసమే పనులు
- ఎక్కడ రేవంత్ బాధ్యతలు తీసుకుంటే అక్కడ బీజేపీ గెలుపు తథ్యం
- మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపణలు

03

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరుగుతుందని ముందే తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం నిజాలను దాచి ఉంచిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరుగుతుందని ముందే రెండు నివేదికలు హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు.






02

## ప్రేమికుల ఆత్మహత్య

పెళ్లికి అంగీకరించలేదని బలవన్మరణం..

కరీంనగర్ జిల్లాలో విషాదం

ఇద్దరు ఇష్టపడ్డారు. పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకొని ఒక్కటవ్వాలి అనుకున్నారు. ఈ విషయాన్ని పెద్దల చెప్పగా, వారు పెళ్లికి నిరాకరించారు. దీంతో వారు అనుకున్న జీవితం జీవించలేమని తెలిసి, వారి స్థానంలో ఇంకొకరిని ఊహించుకోలేక ఎలాగో కలిసి ఉండలేమనుకుని కలిసి ఊరేసుకున్నారు ఆ ప్రేమికులు. ఈ ఘటన కరీంనగర్ జిల్లాలో బుధవారం జరిగింది.



## ఈఏపీసెట్‌కు భారీగా దరఖాస్తులు

- 5 రోజుల్లోనే 48,158 దరఖాస్తుల సమర్పణ

02

## అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యాయత్నం

భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం



02

# సర్కార్ కు హైకోర్టు షాక్

- లగచర్ల, హకీంపేట భూసేకరణపై స్టే
- నోటిఫికేషన్ రద్దు చేయాలని సంచలన తీర్పు

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. లగచర్ల.. హకీంపేట భూసేకరణ రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. ఈ భూసేకరణ పైన పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అయింది. భూసేకరణ కోసం లగచర్ల సమీపంలో కలెక్టర్ తో పాటుగా అధికారుల పైన దాడి జరిగింది. రాజకీయంగానూ పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. ఫార్మా సిటీ కోసం భూ సేకరణ రద్దు చేసిన ప్రభుత్వం మల్టీ పర్పస్ పారిశ్రామిక పార్క్ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. తాజా కోర్టు ఆదేశాలో ప్రభుత్వం తదుపరి అడుగులు ఏంటనేది స్పష్టత రావాల్సి ఉంది. రేవంత్ సొంత నియోజకవర్గం అయిన కొడంగల్ పరిధిలోని లగచర్ల, హకీంపేటలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందుకు సంబంధించి భూసేకరణ కోసం గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. గతేడాది నవంబర్ 11న ఫార్మా




కంపెనీల ఏర్పాటు సంబంధించి భూసేకరణ కోసం లగచర్ల సమీపంలో కలెక్టర్, ఇతర అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలోకి వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై ఒక్కసారిగా కొందరు దాడులకు దిగారు. ఈ ఘటన పెద్ద దుమారానికి కారణమైంది. కాగా, ఈ ఘటనకు సంబంధించి కుట్ర చేశారన్న అభియోగాలతో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ నేతలు, రైతులు కూడా అరెస్ట్ అ యారు. ఫార్మాసిటీని రైతులు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఆ భూసేకరణ నోటిఫికేషన్ ను ప్రభు వం రద్దు చేసింది. నవంబర్ 30న అదే ప్రాంతంలో మల్టీ పర్పస్ పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు నోటిఫి షన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన భూసేకరణను ప్రారంభించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు హైకోర్టును ఆశ్రయించారు. వీని పైన విచారణ నిర్వహించిన హైకోర్టు భూ సేకరణ నోటిఫికేషన్ రద్దు చేస్తూ నిర్ణయం వెలువరించింది. ఇక, ఇప్పుడు ప్రభుత్వం ఈ తాజా ఆదేశాల పైన తదుపరి చర్యలు ఏంటనేది ఆసక్తి కరంగా మారుతోంది.

## ప్రేమికుల ఆత్మహత్య

పెళ్లికి అంగీకరించలేదని బలవన్మరణం.. కరీంనగర్‌జిల్లాలో విషాదం



**ప్రజానావ, కరీంనగర్:** ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చొప్పదండి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం..చొప్పదండి మండలం చిట్యాలపల్లికి చెందిన కొండపర్తి అరుణ్ కుమార్ (24), అదే మండలం భూపాలపట్నంకు చెందిన నాంపెల్లి అలేఖ్య (22) గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. దగ్గరి బంధువులు కూడా అయిన వీరు అలేఖ్య తల్లి దండ్రులకు తమ ప్రేమ విషయాన్ని తెలిపారు. అయితే అలేఖ్య తల్లిదండ్రులు కొంత కాలం క్రితం అరుణ్ ఇంటికి వెళ్లి మీ అబ్బాయికి మా అమ్మాయిని ఇస్తామని ఆయన తల్లి దండ్రులను అడిగారు. అరుణ్ తల్లిదండ్రులు ఇప్పుడే పెండ్లి చేయమని చెప్పారు. అప్పటి నుంచి ఈ రెండు కుటుంబాలు కాస్త దూరంగా ఉంటున్నాయి. ఈ మధ్య అలేఖ్యకు వేరే సంబంధం చూసి పెండ్లి నిశ్చయం చేశారు. ఈ నేపథ్యంలో ఇద్దరు ప్రేమికులు మనస్థాపానికి గురయ్యారు. బుధవారం కాలేజీకి వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చుకుంటానని భూపాలపట్నం నుంచి అలేఖ్య కరీంనగర్‌కు వచ్చి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అరుణ్ వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి ఇద్దరు కలిసి స్థానిక వావిలాలపల్లిలో అరుణ్ అద్దె గదికి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని కరీంనగర్ త్రీ టౌన్ సీఐ తెలిపారు. అరుణ్ తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

## అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యాయత్నం

భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం

**ప్రజానావ, నేరడిగొండ:** అటు ప్రకృతి కన్నెర్ర.. ఇటు ప్రభుత్వం నిర్లక్ష్యంతో రైతులు ఆత్మహత్య బాట పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా నేరేడుకొండ మండలంలో ఓ రైతు దంపతులు అప్పుల ఇబ్బందులతో ఆత్మహత్యకు ఒడిగట్టారు. వీరిలో భర్త మృతి చెందగా భార్య పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని వడూర్‌కు చెందిన ఆడెపు పోశెట్టి(60), ఇందిరా(52) అనే రైతు దంపతులు ఆర్థిక సమస్యల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. పోశెట్టి మరణించగా భార్య ఇందిరాను చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి దంపతులకు మూడెకరాల భూమి ఉండగా ఇటీవల పత్తి కంది పంటలను సాగు చేశారు. వీరికి రెండు లక్షల 30 వేల వరకు అప్పులు ఉన్నాయి. పంట నష్టంతో పాటు వారికి ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ సైతం మాఫీ కాలేదు. ఇటీవల ఇద్దరు కూతుర్ల వివాహం చేయడంతో పాటు, నూతన గృహం సైతం నిర్మించినట్లు స్థానికులు తెలిపారు.

## తాగునీటిని ఇతర అవసరాలకు వాడితే జరిమానా


**ప్రజానావ,సిద్ధిపేట:** వాటర్‌బోర్డు సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించిన వ్యక్తికి అధికారులు జరిమానా విధించిన ఘటన జూబ్లీహిల్స్‌లో బుధవారం చోటుచేసుకుంది. వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ ప్రధాన రహదారిపై వెళ్తుండగా రోడ్డు నంబర్ 78లో నీరు లీకేజీ అవుతున్నట్లు గమనించాడు. స్థానిక జీఎం హరి శంకర్‌ను పరిశీలించాలని ఆదేశించారు. దీంతో ఆయన మేనేజర్‌తో కలిసి అక్కడికి వెళ్లి చూడగా ఓ వ్యక్తి వాటర్‌బోరు సరఫరా చేసే నీటితో బైక్‌ను కడుగుతున్నాడు. ఈ విషయాన్ని ఎండీకి వివరించగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడికి నోటీసు అందించి రూ.వెయ్యి జరిమానా విధించారు. తాగునీటి కోసం ఉద్దేశించిన రక్షిత నీటిని వాహనాలను శుభ్రం చేయడానికి, గార్డెనింగ్, ఇళ్ల పరిసరాలను కడగడానికి వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## అసత్య ప్రచారాలు చేస్తే పరువు నష్టం కేసు వేస్తాం : టీజీపీఎస్సీ

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ పబ్లిక్ కమీషన్ (టీజీపీఎస్సీ) మొత్తం 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి సంబంధించి గతేడాది గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు అక్టోబర్ 21వ తేదీ నుంచి అక్టోబర్ 27వ తేదీ వరకు మొత్తం 7 పేపర్లకు రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు మొత్తం 31,383 మంది క్వాలిఫై అవగా కేవలం 21,093 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. అంటే 67.17 శాతం మాత్రమే పరీక్ష రాశారన్నమాట. దీని ప్రకారం ఒక్కో పోస్టుకు దాదాపు 38 మంది పోటీపడుతున్నారు. మరోవైపు గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాల వెల్లడికి ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తుంది. అయితే తాజాగా గ్రూప్ 1 ఉద్యోగాలపై కొందరు వ్యక్తులు తప్పుడు వార్తలను సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. తాజాగా వీటిపై స్పందించిన టీజీపీఎస్సీ ఆ వార్తలను ఖండించింది. సోషల్ మీడియాలో జరుగుతోన్న అసత్య ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పరువునష్టం దావా వేస్తామంటూ కమిషన్ ప్రకటించింది. అతి త్వరలోనే గ్రూప్ 1 ఫలితాలు వెల్లడిస్తామని స్పష్టం చేసింది. మార్కుల జాబితాను వెబ్‌సైట్‌లో పెడతామని.. అభ్యర్థుల లాగిన్‌లో పేపర్ల వారీగా మార్కులు చేసుకోవచ్చని పేర్కొంది. అంతేకాకుండా గ్రూప్ 1 నియామక ప్రక్రియ పారదర్శకంగానే జరుగుతోందని, ఎలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకున్నామనీ పేర్కొంది. సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను అభ్యర్థులు నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. టీజీపీఎస్సీ గ్రూప్ -1 పోస్టుల అమ్మకమంటూ సోషల్‌మీడియాలో గత కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం జరగడంతో టీజీపీఎస్సీ స్పందించింది. తప్పుదోవ పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న వారిపై మార్చి 5 బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అలాగే సైబర్ క్రైమ్స్ డీసీపీకి సైతం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. గ్రూప్ 1 ఆశావాహుల్లో అపోహలు, గందరగోళం సృష్టించేందుకు నకిలీ వార్తలను ప్రచారం చేస్తున్న వారిపై క్రిమినల్ పరువునష్టం దావా వేసినట్టు కమిషన్ ఇన్‌చార్జి కార్యదర్శి సుమతి తెలిపారు. గ్రూప్1 ఫలితాలను పారదర్శకంగా ప్రాసెస్ చేస్తున్నామని, ఏ అభ్యర్థికీ అన్యాయం జరగదని హామీ ఇచ్చారు.

## ఎమ్మెల్సీ కావాలని అడగబోను

కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**ప్రజానావ, హైదరాబాద్:** తాను ఎమ్మెల్సీ అడగటం లేదని, తాను అడగనని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సీనియర్ నేత జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ కావాలని దేబిరించే పరిస్థితి తనకు లేదన్నారు. తనకు పార్టీ ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇచ్చిందని, పోటీ చేసినా పరిస్థితులు అనుకూలించక ఓడిపోయాయని, మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నానని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ పదవి కావాలని పదేపదే అడిగే గుణం తనది కాదని ఆయన తెలిపారు. గురువారం ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఈ విషయంలో మీడియా మిత్రులు ఎవరూ కూడా ఎమ్మెల్సీ విషయంలో ఊహాగానాల వార్తలు రాయొద్దని ఆయన సూచించారు. 2017 లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సభ ఏర్పాట్ల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లాలని, ఆరు నెలల నుంచి ఢిల్లీకి వెళ్లి రాహుల్‌కు చెప్పాలని అనుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ సభ ఏర్పాట్లు, ఎలాంటి పరిస్థితుల్లో ఆ సభ ఏర్పాట్లు చేశానో రాహుల్‌కు స్వయంగా చెప్పాలని ఢిల్లీకి వెళుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీకి వెళ్లిన తర్వాత రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దొరికితే ఆయనతో మాట్లాడుతానని ఆయన స్పష్టం చేశారు.

## జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీ

తాజా రాజకీయాలపై నేతల చర్చ



**ప్రజానావ, హైదరాబాద్:** తాజా రాజకీయాల నేపథ్యంలో అనూహ్యంగా సీఎం రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా సుమారు అరగంటకు పైగా వీరి మధ్య పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీపై ప్రభుత్వ వర్గాలలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. జానారెడ్డిని ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా నియమిస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం అడిగితే సలహాలు ఇస్తానని జానారెడ్డి బుధవారం మీడియాతో తెలిపారు. దీంతో వీరి భేటీపై అంతా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. జానారెడ్డి వ్యాఖ్యల వల్లే.. ముఖ్య సలహాదారు పదవి ఆఫర్ చేయడానికి సీఎం వెళ్లారంటూ చర్చించుకుంటున్నారు. త్వరలో కేబినెట్ విస్తరణ ఉంటుందనే ఊహాగానాలతో ఈ భేటీ ప్రాధాన్యతతలను సంతరించుకుంది. అలాగే ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తదితర అంశాలపైనా ఇరువురు నేతలు చర్చించివుంటారని అనుకుంటున్నారు.



## స్థానికులకే ఉపాధి

ఫోర్త్ సిటీ నిర్మాణం కోసం కేఎల్ఆర్ కృషి

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

డీసీపీ, లెన్స్ కార్ట్ నిర్మాణాలకు భూమి పూజ

భూనిర్వాసితుల రుణం తీర్చుకుంటాం: కేఎల్ఆర్

**ప్రజానావ, మహేశ్వరం:** ఫోర్త్ సిటీతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలో వచ్చే ప్రతీ పరిశ్రమలో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పిస్తామని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో డీసీపీ కార్యాలయం, లెన్స్ కార్ట్ పరిశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం మహేశ్వరం, కందుకూరు మండలాల్లో రూ.12 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... లెన్స్ కార్ట్ పరిశ్రమ ఏర్పాటుకు 52 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. రూ.1500 కోట్ల పెట్టుబడితో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించే కళ్ల అద్దాల పరిశ్రమలో 1500మందికి ఉద్యోగాలు వస్తాయని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. భూములిచ్చిన రైతన్నలకు ఫ్లాట్లు, పరిహారం, ఉద్యోగాలు ఇచ్చి న్యాయం చేస్తామని ఐటీ మంత్రి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ఇక్కడి రైతులకు తప్పకుండా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. లెన్స్ కార్ట్ పరిశ్రమతో మహేశ్వరం నియోజకవర్గం బ్రాండ్ ఇమేజ్ మరింత పెరగనుందని తెలిపారు. తాను చెప్పగానే పలు అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చిన మంత్రి శ్రీధర్ బాబు సహా ఉన్నతాధికారులు, పరిశ్రమల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం


మొదటి పేజీ తరువాయి



15 శాతం ఉంది. అంటే వందలో 15 ఉద్యోగాలు ఈ కులాలకు చెందిన వారికే ఇస్తారు. అయితే, ఆ జాబితాలోని కులాల మధ్య కూడా అసమానతలు ఉన్నాయి. అందులో కొన్ని కులాలు ముందున్నాయి, మరి కొన్ని కులాలు వెనుకబడి ఉన్నాయని ఆయా కులాల వారు చెబుతూ వచ్చారు. దీనివల్ల ఎస్సీలకు మొత్తంగా ఇచ్చిన రిజర్వేషన్లను కొన్ని కులాలే ఉపయోగించుకుని ముందుకు వెళ్తున్నాయనీ, మిగతా వారు వెనుకబడే ఉంటున్నారనీ ఇతర కులాల వారు ఆరోపిస్తూ వస్తున్నారు. అందుకే ఎస్సీలకు ఇచ్చిన 15 శాతం రిజర్వేషన్‌ను తిరిగి, కులాల మధ్య విభజించి పంచాలనే డిమాండ్ వినిపించింది. ప్రధానంగా రిజర్వేషన్ ఫలితాలు మాలలు వారు ఎక్కువ అనుభవించారు కాబట్టి, ఎస్సీ కులాలను వర్గీకరణ జరపాలంటూ మాదిగలు పోరాడారు. మందకృష్ణ మాదిగ తెలుగునాట ఆ పోరాటంలో ముందు ఉండి అందరిని నడిపించారు.

## ఈఏపీసెట్‌కు భారీగా దరఖాస్తులు

5 రోజుల్లోనే 48,158 దరఖాస్తుల సమర్పణ



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, అగ్రికల్చర్-ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న ఈఏపీసెట్ 2025కు గత శనివారం నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమైన సంగతి తెలిసిందే. మార్చి 1వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అయితే కేవలం ఐదు రోజుల్లోనే ఊహించని రీతిలో దరఖాస్తులు వచ్చాయి. దాదాపు 48,158 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఈఏపీసెట్ కో కన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్ రెడ్డి తెలిపారు. వీరిలో 31,805 మంది ఇంజినీరింగ్, 16,317 మంది అగ్రికల్చర్-ఫార్మసీ, మరో 36 మంది రెండు విభాగాల పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 4, 2025వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. రూ.2,500, రూ.5 వేల ఆలస్య రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకున్నవారికి హైదరాబాద్‌లోని జోన్ 4లో మాత్రమే పరీక్షా కేంద్రాలు కేటాయిస్తారని ఇప్పటికే నోటిఫికేషన్‌లో ఉన్నత విద్యాశాఖ స్పష్టం చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తుల సవరణలకు ఏప్రిల్ 6 నుంచి 8 వరకు అవకాశం ఉంటుంది. రూ.250 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 9వరకు, రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 14 వరకు, రూ.2,500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 18 వరకు, రూ.5 వేల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 24 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులకు తప్పనిసరిగా 2025 డిసెంబరు 31 నాటికి 16 సంవత్సరాల వయసు నిండి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి అంటూ ఏమీ లేదు. ఇక బీటెక్ డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీతోపాటు బీఎస్సీ అగ్రికల్చర్, వెటర్నరీ సైన్స్, హార్టికల్చర్ కోర్సులకు 2025 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సుల్లో చేరేందుకు ఎస్సీ, ఎస్టీలకు 25, ఇతరులకు 22 సంవత్సరాలు గరిష్ఠ వయోపరిమితి నిర్ణయించారు. మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అలాగే ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా పరీక్షలు నిర్వహించనున్నారు. మరోవైపు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏపీలోని విజయవాడ, కర్నూలు పరీక్ష కేంద్రాలను రద్దు చేస్తూ ఇప్పటికే ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. 15 శాతం నాన్ లోకల్ కోటాలో ప్రవేశాలు పొందేందుకు ఏపీ విద్యార్థులకు ఇకపై అనుమతి లేదని తేల్చి చెప్పింది.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శుక్రవారం 7 మార్చి 2025 కరీంనగర్ 3

# కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టారు




- ఇచ్చిన హామీలు నెరవేర్చండి
- ఎమ్మెల్సీల విజయంతో మా బాధ్యత పెరిగింది
- ప్రజా సమస్యలపై నిలదీస్తాం
- సీఎం రేవంత్ గాలి మాటలకు సమాధానం చెప్పాలా
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించి అఖండ విజయాన్ని కట్టబెట్టిన తెలంగాణ సమాజానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు . బీజేపీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ విజయం తెలంగాణ సమాజానికి, ఉపాధ్యాయులకు అంకితం ఇస్తున్నామని అన్నారు.రెండు ఎమ్మెల్సీలు ఏక కాలంలో రావడం చాలా సంతోషం. గత పార్లమెంటు ఎన్నికల్లో ప్రత్యామ్నాయ పార్టీగా బీజేపీని ఆదరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్దీ నెలల్లోనే కాంగ్రెస్ తో సమానంగా తెలంగాణ సమాజం బీజేపీకి ఎంపీ సీట్లు కట్టబెట్టింది . మూడు స్థానాల్లో రెండు కీలకమైనవి. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానంలో బీజేపీని గెలిపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసం చేశాయని గ్రహించే రాష్ట్ర ప్రజలు బీజేపీని గెలిపించారని కిషన్ రెడ్డి అన్నారు. రెండు ఎమ్మెల్సీల విజయంతో బీజేపీ బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి బీజేపీపైన అనేక తప్పుడు ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన రెండు ఎన్నికల్లో బీజేపీని గెలిపించారని.. కాంగ్రెస్ కు కర్రు కాల్చి వాత పెట్టారని కిషన్ రెడ్డి అన్నారు. శాసన మండలి, సభలో ప్రజల సమస్యలపైన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం అన్నారు. శాసన మండలి, సభలో తెలంగాణ ప్రజల గుండె చప్పుడు వినిపిస్తాం. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉంది. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పాలనకు రెఫరండమని తాము అనడం లేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఇప్పటివరకైనా నెరవేర్చాలని గుర్తు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ గిఫ్ట్ మాకు అవసరం మాకు లేదు.. రాహుల్ గాంధీకి ఇచ్చుకోండి. తెలంగాణ ప్రజలు మాకు గిఫ్ట్ ఇస్తున్నారు.. ఇస్తారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని కిషన్ రెడ్డి కాంగ్రెస్‌ను విమర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గాలి మాటలకు సమాధానం చెప్పాలా అని షన్‌రెడ్డి ప్రశ్నించారు. సీఎం గాలి మాటలకు సమాధానం, సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి నాపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. ఆ ఆరోపణలకు ప్రజలే సరైన సమాధానం ఇచ్చారు. ప్రజా తీర్పు.. కాంగ్రెస్ పాలనకు చెంపపెట్టులాంటిదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి. రైతులకు ఎకరాకు రూ. 15 వేలు, యువతకు నిరుద్యోగ భృతి, ఆడబిడ్డలకు నెలకు రూ. 2,500, దళితులకు రూ. 12 లక్షలు, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని ఆ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నాం. జీవో 317 కారణంగా ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన ఇద్దరు ఎమ్మెల్సీలను కిషన్ రెడ్డి అభినందించారు.

# కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కవర్గం సంతోషంగా లేదు

## స్కాలర్‌షిప్‌లు రాక విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు

## రేవంత్‌రెడ్డి అవగాహన లేని పాలనతో కష్టాలు : హరీశ్‌రావు



**ప్రజానావ, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఓ వర్గం సంతోషంగా లేరని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పాలనపై అవగాహన సీఎం రేవంత్‌రెడ్డి అవగాహనరాహిత్యంతో అందరూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా స్కాలర్‌షిప్‌ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పేద, మధ్యతరగతి విద్యార్థులకు శాపంగా విమర్శించారు. విదేశీ విద్యా పథకం కింద ఎంపికై, విదేశాలకు వెళ్లిన విద్యార్థులు స్కాలర్ షిప్ డబ్బులు రాక ఆవేదన చెందుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేకపోవడం దుర్మార్గమన్నారు. నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేస్తుండడం.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు శాపంగా మారుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదని, స్కాలర్‌షిప్‌ల బకాయిల విడుదలకు మార్చి వరకు సమయం ఉందని మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట చెప్పి మూడు నెలలు పూర్తి కావస్తుందని, ఇప్పటివరకు మూడు రూపాయల బకా యిలు కూడా చెల్లించిన దాఖలు లేవని వెల్లడించారు. రేవంత్ సర్కారుకు బడా కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేయడంపై ఉన్న ధ్యాస, పేద విద్యార్థుల చదువులకు బకాయిలు చెల్లించడంపై లేదని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సహా అగ్రవర్ణ పేద విద్యార్థులు విదేశాలకు వెళ్లి, ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రారంభించిన విదేశీ విద్య పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ఒక్క విద్యార్థిని కూడా ఈ పథకం కింద ఎంపిక చేయలేదన్నారు. ఏడాదిన్నరగా ప్రక్రియ దరఖాస్తుల దశలోనే నిలిచిపోయిందని చెప్పారు. కొం దరు దరఖాస్తుదారులు ఇప్పటికే అప్పులు చేసి విదేశీ విద్యకు వెళ్లగా, మరికొందరు ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పథకంలో ఎంపిక అవుతామేమో అనే ఆశతో ఇక్కడే ఉండి ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మొద్దునిద్రను వీడి తక్షణమే స్కాలర్షిప్ బకా యిలను విడుదల చేయాలని, విదేశీ విద్య పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి పేదలకు విదేశాల్లో చదివే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం

## రెండు ఎమ్మెల్సీల గెలుపుతో సంబరాలు



**ప్రజానావ, హైదరాబాద్:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో బీజేపీలో కొత్త ఉత్సాహం నెలకొంది. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయఢంకా మోగించడంతో కమలం పార్టీలో నయా జోష్ కనిపిస్తోంది. పార్టీ కార్యాలయం వద్ద గత రెండురోజులుగా సందడి వాతావరణం కనిపిస్తోంది. వచ్చిపోయే వారితో పాటు, ఒకరినొకరు అభినందనలు తెలుసుకుంటున్నారు. రానున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లోనూ ఇదే జోష్ చూపాలని పార్టీ నేతలు చర్చిస్తున్నారు. ఈ జోష్‌తోనే రాబోయే అన్ని ఎన్నికల్లోనూ విజయం సాధించాలనే పట్టుదలతో ఉంది బీజేపీ. ఇందు కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలను కూడా రూపొందిస్తోంది. ఇక తెలంగాణలో కాంగ్రెస్‌ను ప్రత్యామ్నాయం తామే అని బీజేపీ నేతలు చెబుతున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఛరిష్మా తెలంగాణలో డబుల్ ఇంజిన సర్కార్ తథ్యమని కమలనాథులు అంటున్నారు.వచ్చే స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని యోచన చేస్తోంది. త్వరలోనే ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులతో ప్రధాని మోదీతో సమావేశం ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు సమన్వయం చేస్తున్నారు. ఇదిలా వుంటే బీజేపీ కార్యాలయంలో రెండు ఎమ్మెల్సీల గెలుపుతో సంబురాలు చేసుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా బీజేపీ కైవసం చేసుకోవడంతో ఆ పార్టీ నేతల్లో సంబరాలు అంబరాన్నంటాయి. టీచర్ ఎమ్మెల్సీగా మల్క కొమరయ్య ,పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించారు.తెలంగాణలో కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమరయ్య, అంజిరెడ్డిలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. ఎక్స్ వేదికగా మోదీ స్పందిస్తూ.. 'బీజేపీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదలు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీ అభ్యర్థులకు అభినందనలు. ప్రజల మధ్య ఉంటూ వారి కోసం ఎంతో శ్రద్ధతో పనిచేస్తున్న బీజేపీ కార్యకర్తలను చూసి నేను చాలా గర్వపడుతున్నాను' అంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

# ఎస్ఎల్‌బీసీ ఘటనపై నిజాలు దాస్తున్న కాంగ్రెస్

## ప్రమాదం గురించి పట్టించుకోలేదు

## కమీషన్ల కోసమే పనులు : మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపణలు



**ప్రజానావ, హైదరాబాద్:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరుగుతుందని ముందే తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం నిజాలను దాచి ఉంచిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరుగుతుందని ముందే రెండు నివేదికలు హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కార్మికుల ప్రాణాలను ఫణంగా పెట్టి, నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వం ముందుకు పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటిస్తూ గతంలో రెండు నివేదికలు ప్రభుత్వం వద్ద ఉన్నా, కేవలం కమీషన్ల కోసమే పనులను నిర్వహించిందని కేటీఆర్ అన్నారు. ఆ నివేదికలలో చెప్పిన విధంగానే రెడ్ జోన్ ప్రాంతంలోనే ప్రమాదం జరిగిందని తెలిపారు. ఎనిమిది కుటుంబాల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయయని ఆవేదన వ్యక్తం చేశారు. వేల కోట్ల ప్రజాధనం వృథా అయిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మొత్తం కేబినెట్ ఈ ప్రమాదానికి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఈ రెండు నివేదికల అంశంపై స్పష్టతను ఇవ్వాలని.. హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రాణాలు కోల్పోయిన ఎనిమిది మంది కుటుంబాలతో పాటు రాష్ట్ర ప్రజల తరఫున ఈ అంశంపై పూర్తి వివరాలు విడుదల చేయాలని కేటీఆర్ అడిగారు. ఈ ప్రమాదానికి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఎక్కడ రేవంత్ బాధ్యతలు తీసుకుంటే అక్కడ బీజేపీ గెలుపు తథ్యం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎక్కడ బాధ్యత తీసుకుంటే అక్కడ బీజేపీ గెలుస్తుందని అన్నారు. రేవంత్ ఎక్కడ అడుగుపెడితే అక్కడ కాంగ్రెస్ భస్మమే అని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్, మల్కాజిగిరి బాధ్యత తీసుకుంటే.. ఆయా స్థానాల్లో బీజేపీ గెలిచిందని గుర్తుచేశారు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార బాధ్యత తీసుకుంటే అక్కడ కూడా బీజేపీనే గెలిచిందని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు స్టార్ క్యాంపెయినర్‌గా వెళ్తే అక్కడ కూడా బీజేపీనే గెలిచిందని పేర్కొన్నారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఎప్పుడూ లేని విధంగా ముఖ్యమంత్రి హెూదాలో క్యాంపెయిన్ చేశారని చెప్పారు. కానీ అనూహ్యంగా అక్కడ బీజేపీ అభ్యర్థినే విజయం సాధించారని.. ఇందులో మర్మం ఏమిటో అని సందేహం వ్యక్తం చేశారు. ఈ మర్మం "భడే భాయ్ – ఈ చోటే భాయ్" కే తెలియాలని అన్నారు.

# భూపాలపల్లి అటవీ ప్రాంతంలో చిరుత సంచారం

## ఆందోళనలో స్థానిక ప్రజానీకం

## చిరుత సంచారాన్ని ధృవీకరించని అటవీశాఖ

**ప్రజానావ, జయశంకర్ భూపాలపల్లి:** వామ్మో.. పులి సంచరిస్తోందంటూ జిల్లాలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఎక్కడిదో వీడియో తెలియదుకానీ సోషల్ మీడియాలో మాత్రం వైరల్ అవుతోంది. గోరుగత్తుపల్లి శివారులోని బొక్కిచెరువు సమీపంలో చిరుత పులి సంచరిస్తుందని పుకార్లు జోరందుకున్నాయి. మొక్కజొన్న చేను వద్ద చిరుత పులి తిరుగుతున్న వీడియోను ఓ మహిళ రికార్డు చేసిందంటూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం పులి పాదముద్రలు గుర్తించాకే స్పష్టత ఇస్తామని చెబుతున్నారు. స్థానికులు మాత్రం చిరుత పులి వార్తలపై ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనా చిరుత సంచారం వార్త జిల్లాలో తీవ్రం భయాందోళనకు గురిచేస్తోంది.అయితే జిల్లాలో గత 15 రోజులుగా పులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. అయితే ఓ చోట కనిపించిందంటూ అటవీ అధికారులకు సమాచారం అందడం, వారు అక్కడకు చేరుకుని పాదముద్రలు గుర్తించేలోగా వేరే ప్రదేశానికి వెళ్లిపోవడం జరుగుతూ వస్తోంది. గత పది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది జిల్లాలో. ఈ క్రమంలో గోరుగత్తుపల్లికి సంబంధించిన ఓ వీడియో మాత్రం సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్‌గా మారింది. ఆ గ్రామానికి చెందిన ఓ మహిళా రైతు ఈ వీడియోను చిత్రీకరించినట్లు చెబుతున్నారు. మొక్కజొన్న చేను గట్టుపై నుంచి చిరుత వెళ్తున్న దృశ్యాలు ఆ వీడియోలో కనిపిస్తున్నాయి. అయితే ఈ వీడియోను చూసిన అటవీ శాఖ అధికారులు మాత్రం.. పులి సంచారాన్ని ఇంకా ధృవీకరించలేదు. ఆ ప్రాంతానికి వెళ్లి అక్కడ పులి పాదముద్రలు గుర్తించాకే నిర్ధారిస్తామని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. అయితే వీడియో తమ ఊరిదే అని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు కన్ఫామ్ చేస్తున్నప్పటికీ అటవీ శాఖ అధికారులు మాత్రం నిర్ధారించడం లేదు. గత మూడు వారాలుగా ఈ ప్రాంతంలో పులి సంచరిస్తోంది. భూపాలపల్లి జిల్లాలోని మహాదేవ్‌పూర్, కాటారం అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తూ.. వరంగల్ జిల్లా నల్లబెల్లి, మహబూబాబాద్ జిల్లా గంగారం వరకు వెళ్లి అదే పులి తిరిగి వస్తోందన్నది అక్కడి వారు చెబుతున్నారు. పులి సంచారంపై స్థానికులు మాత్రం తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో పులి సంచారం ఉంది, అటువైపు వెళ్లవద్దని డప్పు చాటింపు వేయిస్తున్నారు. అలాగే అడవిలోకి వెళ్లే రైతులు, పశువులకాపర్లు జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నారసింహుడు

**యాదాద్రి, మార్చి 6:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో 6వ రోజు బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారు గోవర్ధనగిరిధారి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి సింహ వాహనంపై నరసింహుడు ఆలయ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సృష్టిలోని సకల ప్రాణులపై తన దయాగుణాన్ని ప్రసరింపజేసి అపూర్వమైన తన లీలామహత్యాలతో పరిపూర్ణ అవతారంలో లక్ష్మీనృసింహుడు భక్తజనుల పూజలు అందుకుంటున్నాడు. కాగా దివ్యాలంకారాలతో చేతిలో పిల్లన గ్రోవితో తన లీలామృత మృధుమధుర గానంతో సమ్మోహన పరుస్తూ ఏకశిఖరవాసుడు మురళీకృష్ణుడిగా భక్తజనులకు దర్శనమిచ్చారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన బుధవారం స్వామివారు శ్రీకృష్ణ అలంకరణలో ప్రత్యేక సేవలు అందుకున్నారు. జగత్తులో మంచిని రక్షించి.. చెడును చెండాడి, చేసేది ఎవరైనా, చేయించేది నేనే అంటూ లోక జనులందరికీ జ్ఞానసంపదలు ప్రసాదించిన శ్రీ కృష్ణుడి అలంకరణలో నారసింహుడిని భక్తులు దర్శించి తరించారు. భక్తపారాయణుడు జగద్రక్షకుడు శ్రీ మహావిష్ణువు లోకకల్యాణం కోసం అవతరించిన అవతార రూపాల్లో లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో దివ్య వాహన సేవలు అందుకుంటున్నారు. బుధవారం రాత్రి స్వామి వారు పొన్నవాహన సేవపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్త జనులకు దర్శనమిచ్చారు. పొన్న చెట్టు నీడలో చిలిపి కృష్ణుడు చేసిన రాసలీలా వైభవాలు భాగవతంలో పేర్కొన్న రీతిలో వాహన సేవ ఆహ్లాదకరంగా నిర్వహించారు. పొన్నవృక్షంపై వాసుదేవ స్వరూపమని సకల భక్తులకు ఆశ్రయం కలిగించే వాహన సేవలో స్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవాలు ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యులు, అర్చక బృందం, వేదపడింతులు, రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, డీఈవో దోర్భల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీనకుమార్‌శర్మ, జూశెట్టి క్రిష్ణ, గజ్వేల్లి రమే?షబాబు, రఘు, పర్యవేక్షకులు నాగుల మహేష్‌గౌడ్, ధీరావత రామరావునాయక్, రాజనబాబు, వాసం వెంకటేశ్వర్లు, దాసోజు నరేష్, రాకేష్ రెడ్డి, నరేష్, వెంకటేశ, ఉద్యోగ పాల్గొన్నారు.

# అమెరికా పరిణామాలతో ఆందోళన

## ట్రంప్ బెదిరింపులపై మోడీ స్పందించాలి • మోడీతో చంద్రబాబు మాట్లాడాలి • సిపిఐ కార్యదర్శి నారాయణ




**ప్రజానావ, హైదరాబాద్:** ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాక భారతీయులకు రక్షణ లేకుండా పోయిందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. అమెరికాలో తాజా పరిస్థితిపై ఆయన మీడియాతో మాట్లాడారు. 'మోడీ వివిధ దేశాల అధినేతలతో సమావేశాలకే పరిమితం అవుతున్నారు.. ప్రపంచంలో అత్యంత శక్తి వంతమైన దేశంగా ఉన్న అమెరికా బెదిరింపులకు దిగడం సరికాదు.. ఇతర దేశాల సంపదను కొల్ల గొట్టేందుకు అమెరికా ప్రయత్నం చేస్తుంది.. ఎలాన్ మాస్క్ తో డిబేట్ సందర్భంగా వీధి రౌడీ లాగ ట్రంప్ ప్రవర్తన ఉంది.. ప్రపంచ వ్యాప్తంగా ట్రంప్ కు వస్తున్న వ్యతిరేతను భారత్ తరుపున మోడీ ఉపయోగించుకోవాలి.. లేదంటే వంద కోట్ల భారతియుల ప్రయోజనాలను అమెరికా కు తాకట్టు పెట్టినట్లు అవుతుందని నారాయణ అన్నారు. ప్రపంచ పెట్టుబడి దారులంతా ఏకం అయ్యే ప్రమాదం ఉంది.. దీనిమీద చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పి..మోడీతో ట్రంప్ కు చెప్పించే బాధ్యత చంద్రబాబు తీసుకోవాలని నారాయణ వ్యాఖ్యానించారు. అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను అక్కడి ప్రభుత్వం వెనక్కి పంపిస్తోంది. ఇప్పటికే మిలిటరీ విమానంలో వందలాది మంది భారతీయులకు తిరిగి పంపించింది. ఈ అంశంపై ఇప్పటికే ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై మండిపడుతున్నాయి. భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. ఈ అంశంపై స్పందించారు. అక్రమ మార్గాల ద్వారా దేశంలోకి ప్రవేశించిన వారిని తొలుత అమెరికా తిప్పి పంపిందన్నారు. వారంతా అమెరికా భద్రతకు ముప్పుగా పరిణమించారని అక్కడి ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు.

# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



సంపాదకీయం




# బీమా పాలసీలపై జీఎస్టీ దందా !

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలిదశ ముగిసింది. మలిదశ సమావేశాలు మార్చి పదినుంచి పక్షం రోజులు జరగనున్నాయి. ఇవే అత్యంత కీలకమైన రోజులు. విపక్షానికి ఇది నిజంగా పరీక్షాకాలం. వారు అనేకానేక సమస్యలను లేవనెత్తడానికి అవకాశం కొనితెచ్చుకోవాలి. గొడవలతో బాయ్‌కాట్లతో సమస్యలు పరిష్కారం కావు. ఇందులో అత్యంత ప్రధానమైనది జిఎస్టీ అని గుర్తించాలి. జిఎస్టీతో పేద, మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొంటున్న బాదుళ్లను చర్చించాలి. ఎందుకంటే అధికార పార్టీ కాబూలీవాలాల లాగా వసూళ్లకు తెగిస్తోంది. పదేళ్లుగా పోరాటం చేస్తే..ఆదాయపు పన్నును 12 లక్షలకు చేర్చినా అందులోనూ మెలికలే పెట్టారు. మధ్యతరగతి ప్రపజలపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఆర్థిక అంశాలపై పార్లమెంట్‌లో చర్చించడం లేదు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కూడా కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి మాత్రమే తమ వాదనలు చేస్తోంది. బిజెపి ఎంపిలు కూడా ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టి పెట్టుకోవడం లేదు. కుక్కిన పేనుల్లా మోడీ ముందు మోకరిల్లుతున్నారు. ఆహా మోడీ.. ఓహో మోడీ అంటూ భజనలు చేయడానికే సమయం కేటాయిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎక్కడా చర్చ చేయడం లేదు. ఎవరైనా చర్చించినా దానిని పట్టించుకోవడం లేదు. అంతెందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎదురుదాడితో విపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. జిఎస్టీపై గత పార్లమెంట్ సమావేశాల్లో ఆమె చేసిన ఎదురుదాడి ప్రసంగమే ఇందుకు నిదరర్శనం. జీవిత, ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంలపై కేంద్ర ప్రభుత్వ 18 శాతం జిఎస్‌టి విధించడం అత్యంత దుర్మార్గం. ఆపద వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం ఆ కష్టాన్ని సైతం ఖజానాను నింపుకోవడానికి మార్గంగా చూడటం అమానుషం! సొంత పార్టీ నుండే వ్యతిరేకత వ్యక్తమవుతున్నా, సీనియర్ నేతలే ఈ నిర్ణయాన్ని తప్పు పడుతున్నా మోడీ ప్రభుత్వం మాత్రం కష్ట కాలంలోనూ ప్రజల మూలుగులను పీల్చి పిప్పి చేయాలనే భావిస్తోంది. అందుకే ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని టాక్స్ టెర్రరిజంగా అభివర్ణిస్తున్నాయి. జిఎస్‌టిలో వివిధ వస్తువులు, సేవలపై సున్నా నుండి గరిష్టంగా 28 శాతం వరకు పన్నులు విధించవచ్చు. ఈ పట్టికలో చివరి నుండి రెండవ స్థానంలో ఉన్న 18 శాతం జిఎస్‌టిని బీమాపై పాలసీలపై విధిస్తున్న కేంద్రం బంగారం పై మూడు శాతం, వజ్రాలపై 0.25 శాతం మాత్రమే పన్ను వసూలు చేస్తుండటం గమనార్హం. కొన్ని సంవత్సరాలుగా బీమా కంపెనీలు రకరకాల కారణాలు చెబుతూ ప్రీమియం మొత్తాలను ఇష్టా రాజ్యంగా పెంచుతున్నాయి. ఈ పెంపును నియంత్రించే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేయలేదు. రెండు సంవత్సరాల క్రితం 22 సంవత్సరాలున్న ఒక వ్యక్తి ఐదు లక్షల రూపాయల బీమా మొత్తానికి పది వేల రూపాయలు ప్రీమియంగా చెల్లించే పరిస్థితి ఉంటే, గతేడాది ఆ ప్రీమియం 15 వేల రూపాయలకు చేరింది. ఇదే తలకు మించిన భారంగా మారుతుండటంతో అనేక మంది తమ పాలసీలను రద్దు చేసుకుం టున్నారు. ఇప్పుడు 18 శాతం జిఎస్‌టి విధించడంతో కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా దీనిని లేవెనెత్తినా..ఆయనను ఈగలాగా తీసిపారేశారు. ఆయన సూచనలకు విలువనివ్వలేదు. దీంతో పాలసీలపై పడే భారం మరింత పెరుగుతుం దన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడం ఎలా ఉన్నప్పటికీ రోగగ్రస్థ దేశంగా మారే ప్రమాదం ఉంది. ఆరోగ్య పాలసీలను పక్కన పెట్టి ప్రభుత్వం ఇచ్చే ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆరోగ్యశ్రీలపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇది కాస్తా కార్పోరేట్ ఆస్పత్రులను ప్రోత్సహించేలా మారుతోంది. నయా ఉదారవాద విధానాలు అమలు చేస్తున్న పాలక వర్గాలు ఒక వ్యూహం ప్రకారం దేశ వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేశాయి. వైద్య సేవల కోసం ప్రైవేటు రంగంపై ఆధారపడక తప్పని స్థితిని సామాన్యులకు కల్పించాయి. ప్రైవేటు రంగానికి లాభాల లెక్కలే కీలకం కావడంతో వైద్యం సాధారణ ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వ వైద్య రంగాన్ని తిరిగి పట్టాలెక్కిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటలు చెబుతున్నప్పటికీ ఆచరణలో అవి అమలుకు నోచుకోవడం లేదు. ఈ పరిస్థితే వైద్య రంగంలో బీమా ఆవశ్యకతను పెంచాయి. గతేడాది ప్రారంభంలో దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో లండన్ స్కూల్ ఆఫ్ హైజిన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ సంస్థ టి.బి రోగులపై ఒక సర్వే నిర్వహించగా 30 నుండి 61 శాతం మంది ఆర్థిక సమస్యల కారణంగా పూర్తి స్థాయిలో చికిత్సను తీసుకోలేకపోయారని తేలింది. వీరికి ఆరోగ్య బీమా ఉండి ఉంటే పరిస్థితి మెరుగ్గా ఉండేదని ఆ సంస్థ పేర్కొంది. ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ పథకాలు అనేక రాష్ట్రాల్లో అమలవుతున్నప్పటికీ దేశ వ్యాప్తంగా 2021 గణాంకాల ప్రకారం 40 కోట్ల మంది ఎటువంటి ఆరోగ్య బీమా లేకుండా ఉన్నారు. మరోవైపు ప్రభుత్వ బీమా పథకాలకు నిధుల కొరత వెంటాడుతుండటంతో అనేక రాష్ట్రాల్లో కార్పొరేట్ ఆస్పత్రులు వైద్య సేవలను నిరాకరిస్తున్నాయి. తాజా గణాంకాల ప్రకారం నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ బారిన పడి దేశంలో ఏటా 58 లక్షల మంది మృత్యువాత పడుతున్నారు. మెర్సర్ మార్ష్ బెనిఫిట్స్ (ఎమ్ఎమ్‌బి) హెల్త్ ట్రెండ్స్ నివేదిక ప్రకారం ఆసియా ఖండంలోని మెడికల్ క్లయిమ్‌లలో 55 శాతం క్యాన్సర్, 43 శాతం రక్తప్రసరణ వ్యవస్థ ఆధారిత వ్యాధులు ఉంటున్నాయి. మన దేశంలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొంది. జీవన శైలిలో మార్పులు, పెరుగుతున్న ఆరోగ్య సంరక్షణ ఖర్చుల కారణంగా ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీలను కొనుగోలు చేయడం తప్పనిసరి అవసరంగా మారింది. ఒక్క ఆరోగ్య బీమా ప్రీమియంల పైనే ప్రభుత్వానికి గత ఆర్థిక సంవత్సరంలో 8,263 కోట్ల రూపాయలు వసూలైందని ఆనాటి కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో తెలిపారు. అది చాలదన్నట్లు మరింతగా ప్రజల నుండి వసూళ్లు చేయాలని కేంద్రం భావిస్తోంది. 18 శాతం జిఎస్‌టి విధించడం ద్వారా ఏటా రూ.24 వేల కోట్లు కేంద్ర బొక్కసానికి చేరుతున్నాయని అంచనా! ప్రజల రక్త మాంసాలతో ఖజానాను నింపాలని చూడటం సబబు కాదు. దుర్మార్గమైన ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరిచుకోవాలి. దీనిపై పోరాటం ఒక్కటే శరణ్యం. లేదా దీనిపై కేంద్రమే ఓ నిర్ణయం తీసుకుని జీవితబీమా, ఆరోగ్య బీమా పాలసీలపై జిఎస్టీ ఎత్తేయాలి. పేద, మధ్య తరగతి ప్రజలు రక్తమాంసాలు వెచ్చించి కడుతున్న పాలసీలపై జిఎస్టీ విధించడం దుర్మార్గం కాక మరోటి కాదని మోడీ ప్రభుత్వం గుర్తించాలి.

# వీసా గడువు ముగిసినా నగరంలోనే తిష్ట

## ముగ్గురిని విదేశీయులను అరెస్టు చేసిన పోలీసులు




**ప్రజానావ, హైదరాబాద్:** నగరంలో చాలామంది విదేశాల నుంచి వచ్చి వీసా గడుపు ముగుస్తున్నా అక్కడకు వెళ్లడం లేదు. దీంతో ఇలాంటి వారిని పట్టుకునేందుకు పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే వీసా గడువు ముగిసినా నగరంలో అక్రమంగా ఉంటూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు విదేశీయులను వెస్ట్‌జోన్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి దేశాలకు పంపించారు. లైబీరియాకు చెందిన కర్మో మార్టిన్ స్టూడెంట్ వీసాపై 2019లో నగరానికి వచ్చాడు. నిజాం కళాశాలలో 2020 నుంచి 2023 వరకు చదువుకున్నాడు. బ్యాక్ లాగ్‌లు ఉన్నాయని తప్పుడు సమాచారం ఇస్తూ వీసాను పొడిగించుకుంటున్నాడు. సీసీఎస్ అధికారులు అతడిని అదుపులోకి తీసుకొని ఫిబ్రవరి 26న లెబనాన్‌కు పంపించారు. ఉగాండాకు చెందిన పి కబటుకు మేరీ అపోలో ఆస్పత్రిలో చికిత్స తీసుకోవాలంటూ మెడికల్ వీసాపై 2024 డిసెంబర్‌లో నగరానికి వచ్చింది. నగరంలో ఉంటూ వ్యభిచారం చేస్తుండగా సీసీఎస్ అధికారులు అరెస్ట్ చేశారు. విచారణలో మెడికల్ వీసాపై వచ్చిన మేరీ ఇప్పటి వరకు అపోలో ఆస్పత్రికి వెళ్లలేదని తెలుసుకున్నారు. ఆమెను ఈనెల 4న ఉగాండాకు తిరిగి పంపించారు. నైబీరియాకు చెందిన స్టూడెంట్ వీసాపై 2022లో నగరానికి వచ్చాడు. ఏవీ కాలేజ్‌లో చదువుకునేందుకు వీసా తీసుకున్న ఇతడు కనీసం అడ్మిషన్ కూడా తీసుకోకుండా అక్రమంగా ఉంటున్నాడు. వ్యభిచార గృహం నిర్వహణ కేసులో సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతడిని ఈనెల 5న లైబీరియాకు పంపించారు.

# అందనంత దూరం.. బంగారం

- రోజురోజుకూ ధర పెరుగుతున్న వైనం
- పదిగ్రాములు లక్షకు చేరడం ఖాయం
- పెళ్లిళ్ల సీజన్‌లో మరింత భారం



**న్యూఢిల్లీ:** బంగారం.. బంగారమవుతోంది. అందనంతగా రోజురోజుకూ ధరల పెరుగుదల కలవరానికి గురిచేస్తోంది. పదిగ్రాములు లక్షకు చేరడం ఖాయమంటున్న విశ్లేషకుల మాటలతో మరింత ఆందోళన వ్యక్తం అవుతోంది. పెళ్లిళ్ల సీజన్‌లో మరింత భారంగా ధరల పెరుగుదల సామాన్యులకు భారంగా మారింది. ఇలా బంగారం, వెండి ధరలు అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్నాయి. గత మూడు నెలల్లోనే బంగారం ధరలు అమాంతంగా పదివేలకు పైగా పెరిగాయి. దీంతో దాని దూకుడు ఎలా ఉందో గమనించవచ్చు. శుభకార్యాలు, పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో బంగారం ధరలు రోజు రోజుకు ప్రజలకు అందనంతగా పెరుగుతున్నాయి. బంగారం ధర పెరగడానికి అంతర్జాతీయ పరిణామాలు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారీఫ్‌హెచ్చరికలు, ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోత, ఫెడ్? వడ్డీ రేట్లు వంటి అంశాలు పసిడి ధరల్లో హెచ్చుతగ్గులకు కారణమవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అయినప్పటికీ బంగారం ధర భారీగా పెరిగిన నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో బంగారు ఆభరణాలు కొనుగోలు చేయడం తప్పనిసరి అవుతోంది. ప్రధాన నగరాలలో బంగారం ధరలు ఎలా అటుఇటుగా ఒకే రేట్లను పలుకుతున్నాయి. హైదరాబాద్‌లో ప్రస్తుతం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 80,660గా ఉంది. 24 క్యారెట్ల పసిడి ధర రూ. 87,990గా నమోదైంది. విజయవాడలో సైతం ఈ రేట్లే కొనసాగుతున్నాయి. విశాఖపట్నంలో కూడా ధరలు ఇలాగే ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములు రూ. 80,810 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 88,140గా ఉంది. కోల్‌కతాలో ప్రస్తుతం 22 క్యారెట్ల పసిడి ధర రూ. 80,660 పలుకుతోంది. 24 క్యారెట్ల గోల్డ్.. 87,990గా ఉంది. ముంబై, బెంగళూరు, కేరళలోనూ ఇవే రేట్లు కొనసాగుతున్నాయి. చెన్నైలో 22 క్యారెట్ల ధర 10 గ్రాములు రూ. 80,660 ఉండగా, 24 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములు రూ. 87,990గా ఉంది. అలాగే పూణెలో 22 క్యారెట్ల గోల్డ్ రూ. 80,660 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి రూ. 87,990గా నమోదైంది. అహ్మదాబాద్?లో.. 22 క్యారెట్ల ధర రూ. 80,710 కాగా.. 24 క్యారెట్ల పసిడ ధర రూ. 88,040గా కొనసాగుతోంది. భువనేశ్వర్ 22 క్యారెట్ల బంగారం ధర రూ. 80,660.. 24 క్యారెట్ల పసిడి ధర రూ. 87,990గా ఉంది. దేశంలో వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. ప్రస్తుతం కేజీ వెండి ధర రూ. 100 తగ్గి రూ. 97,900 వద్ద కొనసాగుతోంది. క్రితం రోజు ఈ ధర రూ. 98,000గా ఉండేది. కాగా.. హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ. 1,06,900గా ఉంది. కోల్‌కతాలో రూ.? 99,400, బెంగళూరులో రూ. 97,900గా ఉంది. బంగారు పదిగ్రాముల ధరల లక్షకు ఏరడం ఖాయమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# బీజేపీ ఎమ్మెల్సీకి ప్రధాని అభినందనలు



**న్యూఢిల్లీ, మార్చి 6:** తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయంతో కొత్తగా ఎన్నికైన మల్క కొమరయ్య, అంజిరెడ్డిని ప్రధాని మోదీ అభినందించారు. బీజేపీకి మద్దతుగా నిలిచిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలతో కలిసి పనిచేస్తున్న తమ పార్టీ కార్యకర్తలను చూసి గర్విస్తున్నానన్నారు. కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గపు ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమ-రయ్య విజయం సాధించారు. కొమరయ్య విజయం రెండు రోజుల క్రితమే ఖరారుకాగా, పట్టభద్రుల ఫలితం బుధవారం వెలువడింది. కాగా, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో ఫలితం తేలకపోవడంతో.. రెండో ప్రాధాన్య ఓట్లతో అంజిరెడ్డి గెలుపొందారు. రెండు రోజుల పాటు జరిగిన కౌంటింగ్ ప్రక్రియ అడుగడుగునా ఉత్కంఠ రేపింది. బీజేపీ-కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య 'నువ్వానేనా' అన్నట్టుగా గెలుపు దోబూచులాడింది. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో పట్టభద్రుల స్థానానికి మొత్తం 2,52,029 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 28,686 ఓట్లు చెల్లలేదు. వీటిలో 75,675 బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి, 70,565 కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి, 60,419 ఓట్లు బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు వచ్చాయి. నిబంధనల ప్రకారం మొదటి ప్రాధాన్యతలోనే 1,11,672 ఓట్లు పొందిన అభ్యర్థిని విజేతగా ప్రకటించాలి. కానీ మొదటి ప్రాధాన్యంలో ఏ అభ్యర్థికి కూడా అన్ని ఓట్లు రాలేదు. దీంతో రెండో ప్రాధాన్య ఓట్లు లెక్కించారు. మొత్తం 56 మంది పోటీచేయగా, రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించేందుకు గాను 54 మందిని ఎలిమినేట్ చేస్తూ వచ్చారు. చివరకు బీజేపీ అభ్యర్థికే అత్యధిక ఓట్లు వచ్చాయి. గెలుపు కోటాకు అవసరమైన ఓట్లు రాకపోయినా 5వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యం ఉండడంతో మూడో ప్రాధాన్యానికి వెళ్లకుండా అంజిరెడ్డి గెలిచినట్టు అధికారులు ప్రకటించారు.

# రెచ్చగొట్టే చర్యలను ఖండిస్తున్నాం : భారత్



**న్యూఢిల్లీ, మార్చి 6:** భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ లండన్ పర్యటనలో భారీ భద్రతా వైఫల్యం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఆయనపై ఖలిస్థానీ సానుభూతిపరులు దాడికి యత్నించడం కలకలం రేపుతోంది. ఈ అంశంపై భారత్ తాజాగా స్పందించింది. భద్రతాలోపంపై విదేశాంగ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. రెచ్చగొట్టే చర్యలను ఖండిస్తూ.. గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'విదేశాంగ మంత్రి జైశంకర్ యూకే పర్యటనలో చోటు చేసుకున్న భద్రతా ఉల్లంఘన ఫుటేజీని మేం చూశాము. వేర్పాటువాదులు, తీవ్రవాదుల రెచ్చగొట్టే చర్యలను, ప్రజాస్వామ్య స్వేచ్ఛ దుర్వినియోగం కావడాన్ని మేం త్రీవంగా ఖండిస్తున్నాము. ఇలాంటి సందర్భాల్లో ఆతిథ్య దేశం వారి దౌత్యపరమైన బాధ్యతలను పూర్తిగా నెరవేర్చాలి. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకుంటుందని మేం ఆశిస్తున్నాం' అని ప్రకటనలో పేర్కొంది. కాగా, జై శంకర్ ఈనెల 4న యూకే పర్యటకు వెళ్లిన విషయం తెలిసిందే. ఐదు రోజుల పర్యటనలో భాగంగా 9వ తేదీ వరకూ అక్కడే ఉండనున్నారు. ఈ నేపథ్యంలో పలు సమావేశాలకు హాజరవుతున్నారు. బుధవారం రాత్రి లండన్‌లోని ఛాతమ్ హౌస్ లో నిర్వహించిన అధికారిక సమావేశాలకు హాజరయ్యారు. ఈ సమావేశాలు ముగించుకొని బయటకు వచ్చిన సమయంలో కొందరు ఖలిస్థానీ అనుకూల వ్యక్తులు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఖలిస్థానీ జెండాలను ప్రదర్శిస్తూ భారత్, కేంద్ర మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ గుంపులోని ఓ వ్యక్తి భారత జెండాను చేత పట్టి మంత్రి కారుకు అత్యంత సమీపంలోకి దూసుకొచ్చాడు. జాతీయ జెండాను అవమానించేలా ప్రవర్తించాడు. అప్రమత్తమైన లండన్ పోలీసులు వారిని అడ్డుకున్నారు. కారువైపు దూసుకొచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# ఛత్తీస్‌గఢ్‌లో అంతుచిక్కని వ్యాధి.. 13 మంది మృతి



**ఛత్తీస్‌గఢ్, మార్చి 6:** రాష్ట్రంలో అంతుచిక్కని వ్యాధి కారణంగా సుక్మా జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో నెల రోజుల వ్యవధిలోనే 13 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్రమత్తమైన అధికారులు గ్రామంలోని 80 మంది బ్లడ్ శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారు. ఒడిశా సరిహద్దుకు సమీపంలో ఉన్న చిన్న గ్రామం ధనికొర్తలో ఈ ఘటన వెలుగు చూసింది. గ్రామంలో దాదాపు ప్రతి ఇల్లూ ఈ వ్యాధికి ప్రభావితమైంది. ఈవ్యాధి కారణంగా ఇప్పటి వరకూ 13మంది ప్రాణాలు కోల్పోయారు. వీరి మరణానికి ఖచ్చితమైన కారణం మాత్రం తెలియరాలేదు. బాధితులంతా వారి మరణానికి ముందు తీవ్రమైన ఛాతీ నొప్పి, నిరంతర దగ్గుతో బాధపడినట్లు తెలిసింది. అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు ఆ గ్రామానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి స్థానికులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. 80మంది స్థానికుల బ్లడ్ శాంపిల్స్‌ను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఈ అంతుచిక్కని వ్యాధితో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అయితే సుక్మా చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కపిల్ దేవ్ కశ్మప్ మాత్రం.. ఈ మధ్య కాలంలో ఐదు మరణాలే నమోదైనట్లు చెప్పారు. వృద్ధాప్య సంబంధిత కారణాలతో జిల్లా ఆసుపత్రిలో ముగ్గురు వ్యక్తులు మరణించినట్లు తెలిపారు. మరో ఇద్దరి మరణాలకు గల కారణాలపై దర్యాప్తు జరుగుతోందని పేర్కొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

**ప్రజానావ, సిరిసిల్ల:** ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో గురువారం సిరిసిల్ల పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని అన్ని గదులను సందర్శించి, పరీక్షలు జరుగుతున్న సరళిని పరిశీలించారు. ఎంత మంది హాజరు.. గైర్హాజరు అయ్యారు అనే వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ లు కలిసి తనిఖీ చేశారు. ప్రతీ గదిని సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.



# పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి




**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లాలో పెండింగ్ రహదారులు, భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెండింగ్ రోడ్లు, భవనాల పనుల పురోగతిపై ఆర్‌బీ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్లు బోనాల శాఖ పరిధిలో 12 రోడ్లు, 8 భవనాలు (వైద్య కళాశాల తో సహా), 7 బ్రిడ్జిల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు భవనాల శాఖ పరిధిలో పెండింగ్ రహదారి పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు ఏదైనా తాత్సారం ఉంటే వివరాలు అందించాలని, ప్రభుత్వానికి లేఖ రాసి బిల్లుల చెల్లింపు త్వరగా జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రతి రోడ్డు నిర్మాణ స్థితిగతుల గురించి వివరాలు తెలుసుకున్న కలెక్టర్ వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యల పలు సూచనలు

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**పెండింగ్ రహదారులు, భవనాల పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష**

చేశారు. ప్రస్తుత త్వరగా పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చే రోడ్డు నిర్మాణ పనులు ప్రాధాన్యతతో చేపట్టాలన్నారు. రోడ్డు నిర్మాణ పనులకు ఎక్కడ ఇసుక సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యత ప్రమాణాలుతో చేపట్టాలని ఆదేశించారు. వీర్నపల్లి దగ్గర పాఠశాల సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన ఇసుక కేటాయింపులు చేయాలని కలెక్టర్ సంబంధిత తహసీల్దార్ కు చరవాణిలో ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కోడ్ కూడా ముగిసిందని అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి పనులు వెంటనే జరిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. కాంట్రాక్టర్ల తో చర్చలు జరిపి పనులు క్షేత్రస్థాయిలో త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలని అన్నారు. డీఎంఎఫ్‌టీ పరిధిలో పెండింగ్ ఉన్న బిల్లుల వివరాలను సమర్పించాలని, వెంటనే చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రూ.166 కోట్లతో చేపట్టిన వైద్య కళాశాల పనులు పురోగతిలో ఉన్నాయని వీటిని నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు, అన్నదాన సత్రం, ఎల్లారెడ్డిపేట మండలం వీర్నపల్లి వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ముస్తాబాద్ మండలంలో తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం, కోర్టు భవనాల నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌బీ ఈఈ వెంకటరమణయ్య, డీఈలు శాంతయ్య, కిరణ్ కుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రధాన రహదారిపై

# గుంతలను పూడ్చిన లైవ్ నరేశ్ నాయక్

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి దేవుని తండా నుంచి అజ్మీర తండా వరకు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మాయమై ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. ఇది గమనించిన లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బాణోత్ నరేశ్ నాయక్ ట్రాక్టర్ల సాయంతో మట్టిని పోయించి గుంతల మాయమైన రోడ్లను చదును చేయించాడు. దీనిపై వాహనదారులు నరేశ్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేక చొరవ చూపి మిగిలిపోయిన డబుల్ రోడ్డును పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు కిషన్ నాయక్, మోహన్ నాయక్, అమృత్ లాల్ , సంతోష్ నాయక్, బిక్కు నాయక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి




**ప్రజానావ, సిరిసిల్ల:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీజీవో అధ్యక్షులు సమర్పన్, డోర్స్ (డిస్టిక్ ఆఫీసర్స్ ఆఫ్ రాజన్న సిరిసిల్ల) జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని ఆడిటోరియం లో మహిళలకి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం మాట్లాడారు. మహిళలకు సమానమైన హక్కులతో పాటు ప్రత్యేకమైన చట్టాలను కూడా ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. గృహ హింస నిరోధక చట్టం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ చట్టం, నిర్భయ చట్టం వంటి చట్టాల ద్వారా మహిళలు వారి యొక్క హింసల్ని ఎదుర్కోవడానికి

- **టీజీవో అధ్యక్షుడు సమర్పన్, డోర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి**
- **మహిళా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు**

ప్రభుత్వం ఎన్నో శాఖల ద్వారా వారికి సహకారం అందిస్తుందని తెలియజేయడం జరిగింది. మహిళలు ఏ సందర్భంలోనైనా లైంగిక, మానసిక, శారీరక, ఆర్థిక వేధింపులను ఎదుర్కొంటున్నట్లయితే వారికి 181 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వైద్య, న్యాయం, పోలీస్ కౌన్సెలింగ్, షెల్టర్ వంటి సహాయాల్ని అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలకు ప్రభుత్వం ప్రత్యేకమైన రిజర్వేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. మహిళలు ఆర్థికంగా ముందుండడంవల్ల కుటుంబం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల దేవి, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా, దేవిక సఖీ ఇన్‌చార్జి విజయ, అనుపురం మహిళలు పాల్గొన్నారు. అలాగే సఖీ ఆధ్వర్యంలో నర్సింగ్ కాలేజీ కేంద్రంలోనూ మహిళలకు విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం మహిళా అధికారులను సిబ్బందికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సిరిసిల్ల ఆర్డీవో రాధా బాయ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మిషన్ భగీరథ ఈఈ జానకి, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, డిఆర్ డి ఓ శేషాద్రి, మహిళా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేసవి ఎండల తీవ్రత

- **ఉపాధి కూలీలకు ఉదయం 11 గంటల వరకే పనులు**
- **కలెక్టర్ ఉత్తర్వులు అమలు**

**ప్రజానావ, ములుగు:** ములుగు జిల్లా నూగూరు వెంకటాపురం, వాజేడు మండలాల్లో వేసవి ఎండలు తీవ్రత కారణంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే పనులు చేయించాలని ప్రభుత్వ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాలు. ఈ మేరకు పనులు చేసే ప్రాంతంలో మంచినీటి నీటి వసతితో పాటు టెంట్ నీడ కూడా కల్పించాలని, ఎప్పటి మాదిరిగానే ప్రథమ చికిత్స కిట్టు కూడా అందుబాటులో ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు వెంకటాపురం మండలంలోని 18 పంచాయతీల్లో సుమారు 16 పంచాయతీల్లో కూలీలు 11లోపే పనులు ముగించుకొని ఇంటిముఖం పడుతున్నారు. సుమారు 12వేల మంది ఉపాధి హామీ కూలీలు రికార్డు నమోదు ఉండగా, సుమారు 6వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నట్లు సమాచారం. నీటి కుంటల నిర్మాణం, పాం పండ్ల్ ఇతర పనులకు ఈజీఎస్ అధికారులు అనుమతులిచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వులు మార్చి ఒకటో తేదీ నుండే అమల్లోకి రావడంతో, ఈ మేరకు ఈజీఎస్ ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది కూలీలకు వేసవి ఎండల తీవ్రత, వడదెబ్బ తదితర జాగ్రత్తలు ఆరోగ్య అంశాలను వివరిస్తున్నారు. వేకువ జామునే పనులకు హాజరయ్యేలా అవగాహన కల్పిస్తున్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
6 కరీంనగర్ శుక్రవారం 7 మార్చి 2025



# మంత్రివర్గంలో మాదిగలకు రెండు స్థానాలు కల్పించాలి

- మండల కేంద్రంలో మాదిగల ఆత్మగౌరవ డప్పు మహా ప్రదర్శన
- ఎస్సీ వర్గీకరణ నివేదికలో ఉన్న లోపాలను సవరించి అన్ని కులాలకు న్యాయం చేయాలి
- ఎస్సీ వర్గీకరణను ఏబీడీసీ నాలుగు గ్రూపులుగా కేటాయించాలని వినతి

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కొమ్ము రాజశేఖర్ ఆధ్వర్యంలో మాదిగలు డప్పులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ యెలగందుల భిక్షపతి మాదిగ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం మంత్రివర్గంలో మాదిగలకు రెండు స్థానాలు కల్పించి సామాజిక న్యాయం చేయాలని ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై డా. షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలో ఉన్న లోటు పాట్లని సవరించి రాష్ట్రంలో 15 లక్షలు ఉన్న మాల సామాజిక వర్గానికి 5శాతం కేటాయిస్తే 32లక్షలకు పైగా జనాభా ఉన్న మాదిగలకు 11శాతం కేటాయించాల్సిన అవసరం ఉంది. ఎస్సీ వర్గీకరణను మూడు గ్రూపులుగా కేటాయించడం వల్ల ఎస్సీలలో ఉండే కిందిస్థాయి కులాలకు సామాజిక న్యాయం జరగదని, వర్గీకరణను నాలుగు ఏబీసీడీ గ్రూపులుగా కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చే కేబినెట్ సమావేశాల్లో ప్రతిపాదనలను అమలయ్యే విధంగా కృషి చేయాలని అన్నారు. అనంతరం తహసిల్దార్ విజయ ప్రకాశ్‌రావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు తైదల రాజయ్య మాదిగ, మండల ఉపాధ్యక్షుడు కుమ్మరి దిలీప్ మాదిగ, ప్రధాన కార్యదర్శి బొడ్డు శేంకర్ మాదిగ, కార్యదర్శి గంగారం మాదిగ, నాయకులు మల్యాల జాన్సన్, మల్యాల మధుకర్, మల్యాల మనోజ్, దప్పుల భాస్కర్, వివిధ గ్రామాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

## టీడబ్ల్యూ కార్యదర్శికి ఎమ్మెల్యే వినతి

**ప్రజానావ, ఉట్నూర్:** అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ కార్యదర్శి డాక్టర్ ఏ శరత్ ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన ఛాంబర్ లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని నూతన ఐటీడీఏ భవన నిర్మాణానికి రూ. 15 కోట్లు, స్టడీ సర్కిల్ నిర్మాణానికి రూ. 2 కోట్లు, రాజ్ గోండు సేవ సమితి గుస్సాడి గుట్ట వద్ద భవన నిర్మాణానికి రూ.కోటి, పాత ఉట్నూర్ నుంచి కొమ్ముగూడ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

# రానున్న రోజుల్లో బీజేపీదే అధికారం



## బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల్‌కార్ బాలాజీ

**ప్రజానావ, కోనరావుపేట:** రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మిరియాల్ కార్ బాలాజీ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్లలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి ఘన విజయం సాధించిన సందర్భంగా బాలాజీ ఆధ్వర్యంలో కోనరావుపేట మండల కేంద్రంలో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయానికి సహకరించిన టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లకు పట్టభద్రులకు, విజయానికి కృషిచేసిన బీజేపీ కార్యకర్తలకు మండల శాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేశ్ గౌడ్, జిల్లా కిషన్ మోర్చా కార్యదర్శి జింక వెంకటి, ఉప అధ్యక్షులు, ఎడ్ల సుధాకర్ చర్లపల్లి వామన్, తాళ్లపల్లి శేఖర్, చింతల పరుశురాం, బీజేవైఎం అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, రవి, జెట్టి విజయ్ , సురేశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ సర్టిఫికెట్లు సృష్టించిన అధికారి సస్పెన్షన్

**ప్రజానావ, సిరిసిల్ల:** నకిలీ వైద్య సర్టిఫికెట్లు సృష్టించిన వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి సస్పెండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి పీవీసీ కార్యాలయంలో వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారిగా పనిచేస్తున్న జే. కొమురయ్య జనవరి 19, 2024 న మెడికల్ ఇన్ వాలిడేషన్ కోసం దరఖాస్తు చేసుకొని కరీంనగర్‌లోని సన్ షైన్ హాస్పిటల్స్ జారీచేసిన సర్టిఫికెట్లను సమర్పించాడు. అనంతరం విచారణలో జే. కొమురయ్య సమర్పించిన సన్ షైన్ హాస్పిటల్స్ వైద్య సర్టిఫికెట్లు ఫేక్ అని తేలింది. 2017 నుంచి సదరు వైద్యుడు ఆసుపత్రిలో పనిచేయడం లేదని, లెటర్ హెడ్, స్టాంప్స్ మొత్తం నకిలి అని, సంతకాలు కూడా వైద్యులు చేయలేదని విచారణలో తేలండంతో కలెక్టర్ సస్పెండ్ చేశారు.

# చైన్‌మెన్ల ఇష్టారాజ్యం

## సిఫార్సులకు తలొగ్గుతున్న వైనం

### అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు

### అక్రమ కట్టడాలను అరికట్టడంలో టౌన్ ప్లానింగ్ విఫలం



**ప్రజానావ/ సికింద్రాబాద్:** సర్కిల్ 30లో అక్రమ కట్టడాలను అరికట్టడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు విఫలమవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న డివిజన్లలో అక్రమ నిర్మాణాలు తారాస్థాయికి చేరినా అధికారులు మాత్రం వాటిని పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణం జరిగితే నోటీసులు జారీ చేస్తున్నారే తప్ప టౌన్ ప్లానింగ్ చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. ఓవైపు అక్రమ నిర్మాణాలు విరివిగా వెలుస్తున్నా అటువైపు మాత్రం కనీసం కన్నెత్తి చూడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇక బేగంపేట్, రాంగోపాల్ పేట్, నల్లగుట్ట, రాణిగంజ్, రిజిమెంటల్ బజార్, మోండా డివిజన్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాలలో కారు దూరని సందులో సైతం నాలుగంతస్తుల మేడలు దర్శనమిస్తున్నాయి. పాత భవనంపై అనుమతులు లేకుండానే కొత్తగా ఒకటి, రెండు, మూడంస్తుల భవనాల నిర్మాణాలు చేపడతున్నారు. ప్రధాన రహదారిపైనే సంపులు, పార్కింగ్‌లు నిర్మిస్తున్నారు. 50, 100 గజాల స్థలంలో బహుళ అంతస్తులు నిర్మిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చివరికి నల్లగుట్ట ఫుట్‌పాత్ ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపార నిర్వహిస్తున్న ఆజం హోటల్ యజమానిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.



### వారిదే రాజ్యం..

సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్‌కు ఇన్‌చార్జి డీసీపీ సుష్మ ఒక్కరే ఉండటం, డివిజన్లన్నింటికీ సెక్షన్ ఆఫీసర్ లేకపోవడం వల్ల చైన్‌మెన్ల రాజ్యం నడుస్తుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. దీంతో డివిజన్‌లో ఎక్కడ అక్రమ నిర్మాణం జరిగిన మొదటగా నోటీసు ఇచ్చి అందిన కాడికి దోచుకోవడం చైన్‌మెన్లకు పరిపాటిగా మారింది. ఆ తరువాత దానిపై దృష్టి సారించకపోవడం, అధికారుల దృష్టికి తీసుకోకపోవడం వెనుక లావాదేవీలు బలంగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాణిగంజ్ ఎడ్ల బండి అడ్డ వద్ద ఓ పాత భవనంపై అక్రమ కమర్షియల్ దుకాణ నిర్మాణానికి నోటిసులు ఇచ్చినా నిర్మాణం సాఫీగా జరుగుతోంది. టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చిన తిరిగి నిర్మాణం పూర్తిగా జరిగేలా చైన్‌మెన్ల సహకారం పూర్తిగా ఉంటుందని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

### సిఫార్సులకు తలొగ్గుతున్నారా...

సర్కిల్ పరిధిలో అనుమతులు తీసుకుని పై అంతస్తులు, సెల్లార్లు, పది అడుగులు లేని ప్రాంతంలో పెద్ద పెద్ద అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. వాటిపై ఫిర్యాదు చేసినా సిఫార్సుల కారణంగానే టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం వహిస్తున్నారని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. సిఫార్సులకు తలొగ్గే అధికారులు ఉన్నంతకాలం అక్రమ నిర్మాణాలు పుట్టుకొస్తూనే ఉంటాయని, అంతేకాకుండా దీనివల్ల జీహెచ్‌ఎంసీ ఆదాయానికి భారీ గండి పడుతోందని, నిధుల దారిమళ్లింపు జరుగుతుందని ప్రజలు బాహటంగానే చర్చించుకుంటున్నారు.

GHMC



# తెలంగాణ ప్రీమియర్ లీగ్ వచ్చేస్తోంది

- హైదరాబాద్‌లో కొత్త క్రికెట్ స్టేడియానికి అడుగులు
- 150 ఎకరాల్లో స్టేడియం నిర్మాణం



**హైదరాబాద్:** హైదరాబాద్‌లో కొత్త క్రికెట్ స్టేడియాన్ని నిర్మించాలనుకుంటున్నట్లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ రావు తెలిపారు. అలాగే తెలంగాణలో 10 ఉమ్మడి జిల్లాల్లో పది కొత్త మైదానాలను నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. రీసెంట్?గా ఈటీవీ భారత్‌కు జగన్ మోహన్ రావు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఎక్స్?క్లూజివ్? ఇంటర్వ్యూలో ఆయన కీలక విషయాలు వెల్లడించారు. 'హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అనేది తెలంగాణ మొత్తానికి చెందినది. నాలుగు కోట్ల ప్రజలకు చెందినది. హైదరాబాద్?లో ఒకే మైదానం ఉంది. జింఖానాలాంటి సదుపాయాలున్న స్టేడియాలను 10 ఉమ్మడి జిల్లాల్లో నిర్మించాలనుకుంటున్నాం. రాజీవ్ గాంధీ స్టేడియం సీటింగ్ కెపాసిటీ 37,000. నేను తెలంగాణ ప్రభుత్వాన్ని 100 ఎకరాలకు పైగా భూమిని ఇవ్వాలని అభ్యర్థించాను. అక్కడ 60,000-లక్ష మంది కూర్చునే సామర్థ్యం గల స్టేడియాన్ని నిర్మించాలనుకున్నాము' 'తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఇదే విషయంపై అభ్యర్థించాం. దీనికి సానుకూలంగా స్పందిస్తూ 150 ఎకరాలు ఇస్తామని ఆయన అసెంబ్లీలో ప్రకటించారు. మేము 100 ఎకరాలు అడిగితే, ప్రభుత్వం కొత్త స్టేడియం కోసం 150 ఎకరాలు ఇస్తామని చెప్పింది. అక్కడ 30- 40 మినీ స్టేడియాలు, కార్ పార్కింగ్?తో కూడిన పెద్ద మైదానాన్ని నిర్మిస్తాం. ఒకటి లేదా రెండేళ్లలో మేము ఆ ప్రక్రియను ప్రారంభిస్తాం' అని జగన్? మోహన్ రావు తెలిపారు. బేగంపేట్ విమానాశ్రయానికి సమీపంలో 4,000- 5,000 ఎకరాల భూమితో కొత్త నగరాన్ని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి నాకు చెప్పారు. అందులోనే క్రీడా సౌకర్యాలను ఏర్పాటు చేయాలనుకుంటున్నామని ఆయన అన్నారు. గోల్ఫ్ అసోసియేషన్, ఇతర అసోసియేషన్లకు అక్కడే భూమి ఇస్తున్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్?కు కూడా అక్కడే 150 ఎకరాల భూమిని కేటాయిస్తారు. ఐపీఎల్?లో తెలంగాణకు చెందిన ఎక్కువ మంది ప్లేయర్లను ఫ్రాంచైజీలు తీసుకోలేదు. సిరాజ్, తిలక్ వంర్మను మాత్రమే రెండు ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. నేను చాలా ఐపీఎల్ ఫ్రాంచైజీలను మరికొంత మంది ఆటగాళ్లను తీసుకోవాలని అభ్యర్థించాను. కానీ, వారి అవసరాల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారు. మన ఆటగాళ్లను ఐపీఎల్?లో తీసుకోవట్లేదు. ముంబయి, కర్ణాటక, చెన్నై (తమిళనాడు) లీగ్?ల్లో ఆడిన ప్లేయర్లను కొనుగోలు చేస్తున్నారు. అందుకే తెలంగాణ ప్రీమియర్ లీగ్ ప్రారంభిస్తున్నాం. ఐపీఎల్?లో ఎంపికయ్యేందుకు ఆటగాళ్లకు ఈ లీగ్ బాగా ఉపయోగపడుతుందని భావిస్తున్నాను. ఐసీసీ ఛైర్మన్, బీసీసీఐ మాజీ కార్యదర్శి అనుమతి ఇచ్చేందుకు సహకరించారు. తెలంగాణ ప్రీమియర్ లీగ్ కు అనుమతి ఇచ్చినందుకు బీసీసీఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హేమాంగ్ అమీన్?కు ప్రత్యేక కృతజ్ఞతలు. ఐపీఎల్ ముగిసిన తర్వాత జూన్?లో తెలంగాణ ప్రీమియర్ లీగ్ ప్రారంభం కావొచ్చు. టీపీఎల్?ను మొదటి రెండేళ్లు 6-8 జట్లతో ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నాం. ఆ తర్వాత అవసరం అయితే 10 జట్లను ఏర్పాటు చేస్తాం. అపెక్స్ కౌన్సిల్, ఏజీఎంలతో సంప్రదించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటాం. కొత్త ప్రతిభను ప్రోత్సహించడానికే టీపీఎల్. కొత్త ఆటగాళ్లను తీసుకొని వారికి ఉప్పల్ స్టేడియం, మా అకాడమీలలో కోచింగ్ ఇవ్వాలనుకుంటున్నాం. రాజీవ్ గాంధీ స్టేడియంలో టీపీఎల్ అన్ని మ్యాచ్?లు జరుగుతాయి.

# మోస్ట్ అన్ లక్కీ జట్టు దక్షిణాఫ్రికా

## సెమీస్‌లో ఎక్కువసార్లు ఓడిన జట్టుగా రికార్డు



**లాహోర్:** ఐసీసీ టోర్నీల్లో దక్షిణాఫ్రికాకు ఇంకా దురదృష్టం వెంటాడుతూనే ఉంది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టేబుల్ టాపర్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా సెమీస్‌లో మరోసారి ఓడిపోయింది. సెమీస్‌లో ఓడిపోవడం షరా మామూలే అన్నట్టుగా కివీస్ చేతిలో పరాజయంతో ఇంటి దారిపట్టింది. దక్షిణాఫ్రికాలో అగ్రశ్రేణి ఆటగాళ్లున్నారు. మ్యాచ్‌ను నిలబెట్టి నెగ్గించే సత్తా సామర్థ్యం కలిగిన ప్లేయర్లు ఉన్నారు. అయినా ప్రతిసారీ అదే దురదృష్టం ఓటమి రూపంలో వెంటాడుతుంటుంది. లీగ్ దశ వరకూ అద్భుతంగా ఆడి ఆ తరువాత వెనుదిరగడం ఆ జట్టుకు అలవాటుగా మారింది. ఇప్పటి వరకూ ఐసీసీ వన్డే టోర్నీల్లో 10 సార్లు సెమీఫైనల్స్ ఆడిన ప్రోటీస్ జట్టు 9 సార్లు ఓడిపోయింది. సెమీస్‌లో ఎక్కువసార్లు ఓడిన జట్టుగా రికార్డు నెలకొల్పింది. ప్రతిసారీ భారీ అంచనాలతో అడుగు పెట్టడం ఆ తరువాత ఒత్తిడికి గురై ఓడిపోవడం సాధారణమైపోయింది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 1998 తొలి ఎడిషన్ గెలిచిన దక్షిణాఫ్రికా ఆ తరువాత ఏ మెగా టోర్నీలోనూ విజయం సాధించలేదు. 2000, 2002 ఛాంపియన్స్ ట్రోఫీల్లో సెమీ ఫైనల్స్‌కు చేరినా రెండు సార్లు టీమ్ ఇండియా చేతిలో ఓడిపోయింది. 2006, 2013 సీజన్లలో కూడా సెమీస్‌లో అడుగుపెట్టి ఓడిపోయింది. ఇప్పుడు తాజాగా 2025లో కూడా సెమీస్ వరకూ టేబుల్ టాపర్గా నిలిచి న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయింది. వన్డే ప్రపంచకప్‌లో కూడా దక్షిణాఫ్రికా పరిస్థితి ఇలానే ఉంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సంయుక్తంగా ఆతిధ్యమిచ్చిన 1992 ప్రపంచకప్ వాస్తవానికి దక్షిణాఫ్రికాకు తొలి వరల్డ్ కప్. మొదటి ప్రయత్నంలోనే సెమీస్‌కు చేరింది. వర్షం కారణంగా ఇంగ్లండ్ చేతిలో ఓడిపోయింది. 1999 ప్రపంచకప్‌లో కూడా సెమీస్‌లో అడుగుపెట్టి ఆస్ట్రేలియాతో గెలవాల్సిన మ్యాచ్ను టై చేసుకుంది. రన్‌రేట్ ఆధారంగా ఆస్ట్రేలియా ఫైనల్‌కు అర్హత సాధించింది. ఆ తరువాత 2007లో ఆస్ట్రేలియా చేతిలో, 2015లో న్యూజిలాండ్ చేతిలో ఇదే పరిస్థితి. 2015 సెమీఫైనల్ అయితే పూర్తిగా దక్షిణాఫ్రికా స్వయం కృతాపరాధం. ఈ మ్యాచ్‌లో వర్షం కారణంగా 43 ఓవర్లకు మ్యాచ్ కుదించడంతో ప్రోటీస్ జట్టు నిర్ణీత 43 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. డక్‌వర్త్ లూయిస్ నిబంధనల ప్రకారం కివీస్ టార్గెట్ 298 అయింది. ఈ మ్యాచ్‌లో గ్రాంట్ ఇలియట్‌ను రన్ అవుట్ చేసే ఛాన్స్‌ను దక్షిణాఫ్రికా మిస్ చేసుకోవడంతో మ్యాచ్ చేజారిపోయింది. తాజాగా టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్‌లో కూడా ఓటమితో కంట తడిపెట్టుకున్న దృశ్యాలు ఇప్పటికీ క్రికెట్ అభిమానులు మర్చిపోలేరు.

# సన్‌రైజర్స్‌కు గాయాల టెన్షన్

● ఫాస్ట్ బౌలర్ బ్రైడాన్ కార్స్‌కు గాయం ● ఐపీఎల్ సీజన్ మొత్తానికి దూరం ● జట్టులోకి వియాన్ ముల్దార్ ఆగమనం



**హైదరాబాద్:** 2025 ఐపీఎల్ ప్రారంభానికి ముందే సన్?రైజర్స్? హైదరాబాద్‌కు గాయల బెడద మొదలైంది. కాలి గాయం కారణంగా ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్ బ్రైడాన్ కార్స్ రానున్న ఐపీఎల్ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. దీంతో మేనేజ్‌మెంట్ అతడి రిప్లేస్‌మెంట్ ప్రకటించింది. అతడి స్థానాన్ని 27ఏళ్ల సౌతాఫ్రికా ప్లేయర్ వియాన్ ముల్దార్ భర్తీ చేయనున్నట్లు తాజాగా సోషల్ మీడియాలో అనౌన్స్ చేసింది. సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ ముల్దార్‌ను సన్‌రైజర్స్ రూ.75 లక్షలకు సొంతం చేసుకుంది. అతడు 18 టెస్టులు, 25వన్డే, 11 టీ20ల్లో సౌతాఫ్రికా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 59 వికెట్లు పడగొట్టాడు. కాగా, రీసెంట్‌గా కివీస్‌తో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్?లోనూ ముల్దార్ బరిలోకి దిగాడు. బౌలింగ్‌లో 48 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టిన ముల్దార్, బ్యాటింగ్‌లో 8 పరుగులు చేశాడు. కాగా, గతేడాది జరిగిన మెగా వేలంలో ఇంగ్లాండ్‌కు చెందిన కార్స్‌ను సన్‌రైజర్స్ రూ.కోటికి కొనుగోలు చేసింది. అయితే అతడు ఛాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో గాయపడ్డాడు. గాయం తీవ్రత పెద్దది కావడం వల్ల అతడు రానున్న ఐపీఎల్ టోర్నీకి దూరం కావాల్సి వచ్చింది. కాగా 2025 ఐపీఎల్‌లో హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో మొత్తం 9 మ్యాచ్‌లు జరగనున్నాయి. అందులో 7 లీగ్ మ్యాచ్‌లు కాగా, 2 క్వాలిఫైయర్ గేమ్స్. అయితే ఈసారి ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీటింగ్,పెయింటింగ్, వాటర్, టాయిలెట్స్‌తోపాటు స్టేడియం రెనోవేషన్ పనులు ప్రారంభించారు. ఈ విషయాన్ని హెచ్‌సీఏ ప్రెసిడెండ్ జగన్ మోహన్ రావు ఈటీవీ భారత్‌కు రీసెంట్‌గా ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

**సన్‌రైజర్స్ జట్టు:** పాట్ కమిన్స్ (కెప్టెన్), హెన్రిచ్ క్లాసెన్, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, నితీష్ కుమార్ రెడ్డి మహ్మద్ షమీ, హర్షల్ పటేల్, ఇషాన్ కిషన్, రాహుల్ చాహర్, ఆడమ్ జంపా, అథర్వ తైడే, అభినవ్ మనోహర్, సిమర్‌జీత్ సింగ్, జీషన్ అన్సారీ, జయదేవ్ ఉనద్కత్, సచిన్ బేబీ, వియాన్ ముల్దార్

# షమీ ఎనర్జీ డ్రింక్ తాగడం నేరం కాదు

## క్రికెటర్‌కు బాసటగా ముస్లిం మత పెద్దలు

**న్యూఢిల్లీ:** చాంపియన్స్ ట్రోఫిలో ఆడుతున్న భారత ఆటగాళ్ల ఏకాగ్రతను దెబ్బతీసేలా మహమ్మద్ షమీపై కొంత మంది చేస్తునన విమర్శలు మంచిదని కాదన్న ముస్లిం మత పెద్దలు అంటున్నారు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో మహమ్మద్ షమీ ఎనర్జీ డ్రింక్ తాగుతున్న వీడియో వైరల్‌గా మారింది. ప్రస్తుతం రంజాన్ మాసం నడుస్తోందని ముస్లింలు అందరూ రోజా ఉపవాసాలు పాటించాలని భావిస్తున్నారు. కనీసం మంచి నీళ్లు కూడా తాగరని అంటున్నారు. ఈ నిబంధనను షమీ ఉల్లంఘించాడని కొంత మంది మత పెద్దలు ఆరోపణలుచేస్తున్నారు. క్రీడాకారులు మైదానంలో ఆడుతున్నపుడు గ్లూకోజ్ వాటర్ లేదా మరేదైనా డ్రింక్స్ తాగుతారు. బాడీ అలసిపోకుండా ఉండేందుకు ఎనర్జీ కోసం ఇలా చేస్తారు. ఒకవేళ ఏదైనా ఆట ఆడుతున్నపుడు దాహం వేసినా ఎనర్జీ డ్రింక్ తాగకపోతే అది డీహైడ్రేషన్‌కు గురై కళ్లు తిరిగే అవకాశం ఉంటుంది. అందువల్లనే క్రీడాకారులు మైదానంలో కాస్త బ్రేక్ తీసుకుని మరీ డ్రింక్స్ తాగుతారు. అందుకే షమీ తప్పేమీ చేయలేదని.. చాలా మంది మద్దతు తెలుపుతున్నారు. పవిత్ర మాసంలో ఉపవాసాలు ఉండాలి కానీ.. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి.. మినహాయింపును ఇస్లాం ఇచ్చిందని ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధి తెలిపారు. షమీని నిందించడం కరెక్ట్ కాదని అత్యధిక మంది ముస్లిం మత పెద్దలు స్పష్టం చేస్తున్నారు. పాకిస్తాన్ ఆటగాళ్లు అందరూ అదే పని చేస్తున్నారన్న సంగతిని గుర్తించాలని అంటున్నారు. షమీపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్న వారెవరికీ ఇస్లాంపై సరిగ్గా అవగాహన లేదని ఎక్కువ మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగాషమపై కొందరు చేసిన విమర్శలు అసూయతోనే చేశారని అంటున్నారు.





# అందం.. అభినయం..

## ఆకట్టుకుంటున్న మృణాళిని రవి

మృణాళిని రవి తమిళం, తెలుగు చిత్రాలలో నటించి కథానాయకిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. సినిమాల్లో ఆమె నటనతో ప్రేక్షకులను తనదైన శైలిలో ఆకట్టుకుంటుంది ఈ బ్యూటీ. ఎప్పుడు సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉంటూ తన సినిమా అప్డేట్స్, ఫొటోలతో అభిమానులను అలరిస్తుంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా కొన్ని ఫోటోలను షేర్ చేరేసింది. చీరలో ఈ బ్యూటీని చుసిన కుర్రాళ్ల వావ్, సూపర్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. 10 మే 1995న కేంద్రపాలిత ప్రాంతం అయినా పాండిచ్చేరిలో ఓ సాధారణ తమిళ కుటుంబంలో పుట్టి, పెరిగింది మిర్నాళిని రవి. అందంతో పాటు అభినయంతో ప్రేక్షకులను తనదైన నటనకి ఫిదా చేస్తుంది ఈ బ్యూటీ. బెంగుళూరులోని ఈస్ట్ పాయింట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నుండి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో బ్యాచిలర్ డిగ్రీ పట్టభద్రురాలైంది. బెంగుళూరులోనిలో సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌గా పనిచేసింది. నటనపై ఆసక్తితో తన ఉద్యోగాన్ని విడిచిపెట్టింది. తమిళం, తెలుగు భాషలలో సుపరిచితురాలు. డబ్స్మాష్ వీడియోలను అప్‌లోడ్ చేస్తూ సోషల్ మీడియాలో పేరు తెచ్చుకుంది. దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా ఆమె వీడియోలలో ఒకదాన్ని చూసి తనను ఆడిషన్ కోసం పిలిచి తన సినిమాలో ఎంపిక చేసారు. ఆలా 2019లో సూపర్ డీలక్స్ అనే ఓ తమిళ చిత్రంలో ఏలియన్ అమ్మాయిగా సినీ అరంగేట్రం చేసింది ఈ వయ్యారి భామ. తర్వాత అదే ఏడాది వరుణ్ తేజ్ గద్దలకొండ గణేష్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించి తెలుగు తెరకు పరిచయం అయింది. 2023లో సయ్యద్ సోహెల్ కి జోడిగా ఆర్గానిక్ మామా హైబ్రిడ్ అల్లుడు, సుధీర్ బాబుకి జంటగా మామా మశ్చీంద్ర చిత్రాల్లో కనిపించింది. ఇటీవల తమిళ రొమాంటిక్ కామెడీ డ్రామా చిత్రం రోమియో సినిమాతో ఆకట్టుకుంది ఈ అందాల తార.



# 300 కోట్లు దాటిన సంక్రాంతికి వస్తున్నాం

విక్టరీ వెంకటేష్ నటించిన సినిమాలు ప్రేక్షకులకి ఏ మాత్రం బోర్ కొట్టించవు. సూపర్ హిట్ కాకపోయిన మినిమం ఆడతాయి. ఆయన నటించిన తాజా చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. ఈ మూవీ సంక్రాంతి కానుకగా వచ్చి సూపర్ హిట్ అయింది. థియేటర్లలో రూ. 300 కోట్లకుపైగా వసూళ్లు సాధించి రికార్డు సృష్టించింది.రీసెంట్‌గా 50 రోజులు కూడా పూర్తి చేసుకుంది. 92 సెంటర్లలో 50 రోజులు పూర్తి కావడంతో ఈ మైలురాయి తమ ఎగ్జిబిటర్లు, పంపిణీదారుల అచంచలమైన అంకితభావంతో సాధ్యమైందని, వారు సినిమాను అన్ని మూలలకు చేరేలా చూశారంటూ దర్శకుడు అనీల్ రావిపూడి ఎమోషనల్ ట్వీట్ చేశారు. అయితే ఇంత మంచి హిట్ తర్వాత వెంకటేష్ కథల విషయంలో చాలా జాగ్రత్తలు పడుతున్నాడట. ఏ సినిమా పడితే ఆ సినిమా చేయకుండా ప్రేక్షకులకి మరింత వినోదం పంచేలా సినిమా చేయాలని అనుకుంటున్నాడట. సంక్రాంతికి వస్తున్నాం సినిమా రిలీజ్ తర్వాత వెంకటేష్ దాదాపుగా 25కు పైగా కథలు విన్నాడని టాక్. అయితే వాటిలో వెంకీ ఒక్కటి కూడా ఓకే చేయలేదు అని టాక్ . ఏ మాత్రం కొద్దిగా బాలేదు అని అనిపించినా ఎంత పెద్ద డైరెక్టర్ అయిన కూడా వెంకటేష్ మొహమాటం లేకుండా నో చెప్పేస్తున్నాడట. అందుకు కారణం గత అనుభవాలే మరి. వెంకటేష్ ప్రధాన పాత్రలో రూపొందిన ఎఫ్ 2, ఎఫ్ 3 చిత్రాలు ఎంత పెద్ద విజయం సాధించాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమాల తర్వాత శైలేష్ కొలను డైరెక్షన్‌లో సైంధవ్ అనే యాక్షన్ సినిమా చేశాడు. ఆ మూవీ పెద్ద డిజాస్టర్‌గా మిగిలింది. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని సంక్రాంతికి వస్తున్నాం సక్సెస్‌ను కంటిన్యూ చేయాలని భావిస్తున్న వెంకటేష్ కథల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాడట.



# శ్రీలీలకు ఆఫర్లే ఆఫర్లు!

శ్రీలీల ప్రధానంగా తెలుగు, కన్నడ సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తుంది. ఆమె 2017లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. 2019 కన్నడ కిస్‌తో పాటు తెలుగులో పెళ్లి సందడి, ధమాకా వంటి చిత్రాలతో మంచి పేరు తెచ్చుకుంది. తెలుగు ఉత్తమ నటిగా అవార్డును గెలుచుకుంది ఈ బ్యూటీ. తర్వాత తెలుగు వరుస సినిమాలు చేస్తు బిజీగా ఉన్న ఈ వయ్యారి గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం రండి.. 14 జూన్ 2001న డెట్రాయిట్ లోని మిచిగాన్ లో ఒక తెలుగు కుటుంబంలో జన్మించింది శ్రీలీల. బెంగుళూరులో పెరిగింది. ఆమె తల్లి స్వర్ణలత బెంగళూరులో గైనకాలజిస్ట్. స్వర్ణలత పారిశ్రామికవేత్త సూరపనేని శుభాకరరావుతో విడిపోయిన తర్వాత స్వర్ణలతకు లీల జన్మించింది. తన చిన్నతనంలోనే 5 ఏళ్ల వయసులో భరతనాట్యంలో శిక్షణ ప్రారంభించింది. ఆమె డాక్టర్ కావాలని కోరికతో 2022లో ఆమె చివరి పూర్తి చేసింది ఈ వయ్యారి. 2017లో చిత్రాంగద అనే తెలుగు హారర్ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసింది. ఈ సినిమలో ప్రధాన పాత్రలో కనిపించిన సింధు తోలాని చిన్నప్పటి పాత్రలో నటించింది . తర్వాత కిస్ అనే కన్నడ చిత్రంతో తొలిసారి కథానాయకిగా కనిపించింది. 2021లో పెళ్లి సందడి సినిమాతో కథానాయకిగా తెలుగు చలనచిత్ర అరంగేట్రం చేసింది. ఇందులో ఈమె నటనకి సైమా వైదికపై మోస్ట్ ప్రామిసింగ్ న్యూకమర్ అవార్డు అందుకుంది. తర్వాత ధమాకా చిత్రంలో హీరోయిన్ గా నటించి బ్లాక్ బ్లాక్ బస్టర్ అందుకుంది. దీనికి సైమా ద్వారా ఉత్తమ నటి అవార్డు అందుకుంది. తర్వాత వరుస సినిమాలు చేసింది. 2023లో స్కంద, భగవంత్ కేసరి, ఆదికేశవ, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, వంటి సినిమాల్లో నటించగా భగవంత్ కేసరి మాత్రమే ఆకట్టుకుంది. 2024లో గుంటూరు కారంలో నటించిన అది ఆశించిన ఫలితాన్నిఅందుకోలేకపోయింది. అదే ఏడాది పుష్పా 2లో స్పెషల్ సాంగ్ చేసి అలరించింది. ప్రస్తుతం నితిన్ సరసన రాబిన్?హుడ్, రవితేజకి జోడిగా మాస్ జాతర, పవన్ కళ్యాణ్ పక్కన ఉస్తాద్ భగత్ ?సింగ్ చిత్రాల్లో నటిస్తుంది. అలాగే తమిళంలో శివ కార్తికేయన్ హీరోగా వస్తున్న పరాశక్తిలో కథానాయికగా నటిస్తుంది. వీటితో పాటు హిందీలో ఓ సినిమాకి సైన్ చేసింది.

# వీరి పిచ్చి పీక్స్‌లోకి వెళ్లింది..


## వంద రూపాయల నోటుపై గాంధీజీ ప్లేస్‌లో అల్లుఅర్జున్ ఫొటో

పుష్ప సినిమాతో బన్నీ (అల్లుఅర్జున్) నేషనల్ అవార్డ్ కూడా అందుకున్నాడు. ఇక రీసెంట్‌గా పుష్ప2 చిత్రంతో పలకరించగా, ఈ మూవీ కూడా సూపర్ డూపర్ హిట్ అయింది. ఏదేమైన పుష్ప ఫ్రాంచైజీతో అల్లు వారబ్బాయి అందరివాడు అయిపోయాడు. ఇప్పుడు ఆయన తదుపరి సినిమాల గురించి చర్చ జోరుగా నడుస్తుంది. పలువురు దర్శకుడు క్యూలో ఉండగా,ముందుగా ఏ డైరెక్టర్‌తో చేస్తాడా అని అందరి ముచ్చటించుకుంటున్నారు. అయితే అల్లు అర్జున్ ఈ విషయంలో ఏ మాత్రం తొందరపడడం లేదు. పుష్ప కోసం అనుకోకుండా ఐదేళ్లు తీసుకున్నానని.. ఇకపై ఏడాదికి రెండు సినిమాలు కాకపోయినా కనీసం ఒక్కటైనా చేస్తానంటూ ఆ మధ్య అభిమానులకు బన్నీ ప్రామిస్ చేశారు. అయితే ఆయనకి ఇప్పుడు ఉన్న మార్కెట్ దృష్ట్యా ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాస్త కష్టమే. మొన్నటి వరకు త్రివిక్రమ్‌తో సినిమా అన్నారు. సడన్‌గా రేసులోకి అట్లీ వచ్చారు. త్రివిక్రమ్ సినిమా ఇప్పట్లో ఉండకపోవచ్చని నాగవంశీ కూడా ఆ మధ్య హింట్ ఇచ్చారు. దాదాపు అట్లీ, బన్నీ కాంబో ఫిక్సైపోయినట్లే. అట్లీ ప్రస్తుతం తన టీంతో అల్లు అర్జున్ కోసం స్టోరీ సిట్టింగ్స్ మొదలు పెట్టారు. సన్ పిక్చర్స్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో ప్లాన్ చేస్తున్నారు. ఇక ఇదిలా ఉంటే అల్లు అర్జున్ క్రేజ్ రోజు రోజుకి ఏ రేంజ్‌లో పెరుగుతుందో మనం చూస్తూనే ఉన్నాం. ఆయనకి ఆర్మీ కూడా ఉంది. కొందరు అభిమానులు బన్నీని ఎక్కడికో తీసుకెళ్లాలని పిచ్చి పనులు చేస్తున్నారు. తాజాగా వంద రూపాయలు నోటుపై బన్నీ ముఖ చిత్రం ఉన్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గాంధీ తాతని బదులు పుష్పరాజ్ ని పెట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు పుష్పరాజ్ ఫ్యాన్స్. కాని దీనిని కొందరు తప్పు పడుతున్నారు. మీ పిచ్చి పీక్స్ కి వెళ్లిందిగా అని కామెంట్ చేస్తున్నారు.



# ఛావా కోసం కలెక్టర్‌కు విజ్ఞప్తి

బాలీవుడ్‌లో బ్లాక్ బస్టర్ అందుకున్న ఛావా సినిమాను తెలుగులో విడుదల చేయనున్న విషయం తెలిసిందే. మార్చి 07న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా విడుదలకు ముందే చిక్కుల్లో పడింది. ఈ సినిమా తెలుగు వెర్షన్ విడుదలను ఆపివేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ జియా ఉల్ హక్ నేతృత్వంలోని బృందం నెల్లూరు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ లేఖలో ఛావా చిత్రం విడుదలను ఆపివేయాలని ఈ చిత్రం చరిత్రను వక్రీకరించి చిత్రీకరించబడిందని, దీని విడుదల వల్ల రాష్ట్రంలో మత సామ-రస్యం దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. ఈ వినతిపత్రంపై నెల్లూరు జిల్లా కలెక్టర్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే సినిమా విడుదలపై తుది నిర్ణయం స్థానిక అధికారులు సెన్సార్ బోర్డు అభిప్రాయాల ఆధారంగా ఉండే అవకాశం ఉంది. మరోవైపు ఈ విషయం సోషల్ మీడియాలో కూడా విస్తృత చర్చకు దారితీసింది, కొందరు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తుండగా.. మరికొందరు ఫెడరేషన్ ఆందోళనలను సమర్థిస్తున్నారు. ఛావా సినిమా విషయానికి వస్తే.. మహారాష్ట్ర యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ పెద్ద కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా వచ్చింది.



Printed, Published and Owned by **Adula Thirupathi**, and Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, and Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TELTEL/2023/87657** Email: prajanaava@gmail.com. Phone No: **99484 33277.**